


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 258, పేజీలు - 08

బుధవారం, మార్చి 4, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## 99 రోజుల పాటు అలుపెరుగని పరుగే

### - కలెక్టర్లతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

- కలెక్టర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం - పలువురు జిల్లాల్లో ఉండటం లేదని సీరియస్
- 99 రోజులు కలెక్టర్లు జిల్లాలు దాటొద్దన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల పాటు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రభుత్వ ప్రాధాన్యతలపై జిల్లా కలెక్టర్లకు రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రతీ అర్హుడికి అందాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కింది స్థాయిలో అధికార యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని ప్రభుత్వ పథకాలు, సేవల్లో పారదర్శకత పెరగాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని ఆ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు.

2లో..

## ఇరాన్‌పై అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'

### - ఫ్యాక్ట్ షీట్ విడుదల



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్‌పై అమెరికా భారీ సైనిక చర్యకు దిగింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా తొలి 72 గంటల్లోనే 1,700కు పైగా లక్ష్యాలను ఛేదించినట్లు ప్రకటించింది. బాంబర్లు, ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలతో ఇరాన్‌లోని కీలక ప్రాంతాలపై విరుచుకుపడుతోంది. ఈ యుద్ధంలో అమెరికాదే గెలుపని, ఉగ్రవాద ఇరాన్ పాలన ఓడిపోతుందని వైట్‌హౌస్ ధీమా వ్యక్తం చేసింది. ఈ మేరకు పెంటగాన్ ఒక ఫ్యాక్ట్ షీట్‌లో వెల్లడించింది. పెంటగాన్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ ప్రకారం, ఫిబ్రవరి 28న తెల్లవారుజామున 1:15 గంటలకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'

2లో..

## భారత్‌కు రష్యా భరోసా

### - యుద్ధం వేళా కీలక ప్రకటన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా ఇంధన సరఫరాలు, ధరలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు చమురు సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని రష్యా మంగళవారం సంకేతాలు ఇచ్చింది. "గల్ఫ్ సంక్షోభం కారణంగా ఇంధన సరఫరాకు అవాంతరం ఏర్పడితే భారత్‌కు సహాయం చేయడానికి రష్యా సిద్ధంగా ఉంది' అని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య భీకర పోరుతో పశ్చిమాసియాలో నెలకున్న పరిస్థితులు, వాణిజ్యం, నౌకల రవాణా, ఇంధన మార్కెట్లపై ప్రభావాన్ని భారత్ నిశితంగా గమనిస్తోన్న వేళ రష్యా నుంచి ఈ సంకేతాలు రావడం గమనార్హం.

2లో..

## గ్రామ వికాసమే లక్ష్యం

### - చంద్రబాబు-పవన్ భేటీలో కీలక నిర్ణయాలు

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్
- గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ
- జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన తాజా భేటీ రాష్ట్ర రాజకీయాల్లోనూ, అధికార వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తించింది. అయితే వీరి భేటీ పూర్తిగా పాలనా పరమైన అంశాల ఆధారంగానే సాగిందని తెలుసతోంది. గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సాగిన ఈ భేటీపై పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.



- గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా జాగ్రత్తలు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం చంద్రబాబు

2లో..

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో మరో అడ్డంకి

### - జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న జనాలను బలవంతంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖాళీ చేయిస్తోందని ఇప్పటికే స్థానికులు, ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. అదే సమయంలో మూసీ ఒడ్డున గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా భారీ మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని దానికోసం భారీగా అక్కడ కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో అంశం తెరపైకి వచ్చింది. మూసీ నది ఒడ్డున ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భారీగా చెట్లను నరికివేస్తున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల లాయర్ ఇమ్మనేని రామరావు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు.

మూసీ నది అభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ చేపట్టిన మూసీ రివర్



ఫ్రంట్ ప్రాజెక్టుపై జాతీయ మానవ హక్కుల కమిషన్?లో లాయర్ ఇమ్మనేని రామారావు కేసు నమోదు చేశారు. మూసీ ప్రాజెక్టు పేరు చెప్పి ఆ నది చుట్టుపక్కల పర్యావరణ

2లో..

## అటవీ శాఖ ఆధ్వర్యంలో 'హనుమాన్ ప్రాజెక్ట్'

- మనుషులకీ వన్య ప్రాణులకీ మధ్య సంఘర్షణ నివారణకు 'హనుమాన్'
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- కట్టుదిట్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు - విజయవంతంగా కుంకీ ఆపరేషన్స్

అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్ట్ హనుమాన్ ను ప్రారంభించింది. ఏపీలో ఈ తరహా ప్రాజెక్ట్ అమలులోకి రావడం ఇదే ప్రథమం. పవన్ కల్యాణ్ మంగళగిరిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. మానవ-వన్యప్రాణి సంఘర్షణను నివారించడం కోసం ఈ హనుమాన్ ప్రాజెక్ట్ కు రూపకల్పన చేశామని పవన్ కల్యాణ్ తెలిపారు. దీన్ని సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ పథకంగా



2లో..

## విద్యుత్ వినియోగంలో నయా రికార్డ్

### - రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్

- 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ వెల్లడి
- భవిష్యత్తు విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించిన భట్టివిక్రమార్క
- డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎండాకాలం మొదలైంది. మార్చి మొదటి వారం నుంచే భానుడి భగభగలు తట్టుకోలేక జనం అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ వినియోగం కూడా పెరిగిపోతోంది. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ క్రమంగా

2లో..

## నార్సింగిలో అక్రమ వెంచర్లు హైడ్రాకు కనిపించడం లేదా

### - నార్సింగిలో ఉద్రిక్తత, కల్వకుంట్ల కవిత అరెస్ట్

- అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయంటూ కవిత ఆందోళన
- ఈ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ - బీఆర్ఎస్ హయాంలో ఇక్కడి భవనాలకు అనుమతులు ఇచ్చారని విమర్శలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. నార్సింగిలో మూసీనదిని ఆక్రమించి నిర్మిస్తున్న ఓ వెంచర్ వద్ద కవిత స్థానికులతోకలిసి ఆందోళన చేపట్టారు. మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తోన్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ పై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలిసి కవిత ఆందోళన చేపట్టారు. మూసీ నదిలోనే భారీ అంతస్తుల భవనాలను కడుతుంటే హైడ్రాకు కనబడటం లేదా అని కవిత ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో పేదల ఇళ్లను కూల్చేశారు. ఖమ్మంలోని వెలుగుమట్లలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చేశారు. మూసీలో



2లో..

## హోర్ముజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్

### - నిలిచిపోయిన 37 భారత నౌకలు

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం జెండాలు ఉన్న 37 నౌకలు హోర్ముజ్ జలసంధి తదితర ప్రాంతాల్లో నిలిచిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కారణంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 1,109 మంది నావికులతో కూడిన సుమారు 37 భారత జెండా కలిగిన నౌకలు పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్, సమీప ప్రాంతాల్లో నిలిచిపోయాయి. ఇందులో కొన్ని నౌకలు భారత ఓడరేవులకు ముడి చమురు, ఎల్‌ఎన్‌జీతో వస్తుండగా,




2లో..

## ఇండోనేషియాలో భారీ భూకంపం

2లో..

### - రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రత నమోదైనట్లు వెల్లడి



## లొంగిపోయిన మావోలు కాంగ్రెస్ లోకి వస్తే ఆహ్వానిస్తాం

- కార్పొరేట్లకే బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందన్న మహేశ్ గౌడ్
- తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని విమర్శ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే చాలా మందిని మట్టుబెట్టగా ఎంతో మంది మావోయిస్టులు అడవులు వదిలేసి జనాల్లోకి వచ్చి పోలీసుల ముందు లొంగిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా చాలా మంది నక్సల్స్

2లో..

## యూట్యూబ్‌లో మోదీ ప్రపంచ రికార్డు

### - 3 కోట్ల సబ్‌స్క్రైబర్లతో నంబర్ వన్ గ్లోబల్ లీడర్‌గా

భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాదరణ క్షేత్రస్థాయిలోనే కాకుండా డిజిటల్ వేదికలపై కూడా తిరుగులేదని మరోసారి నిరూపితమైంది. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో ఆయన అధికారిక ఛానల్ 30 మిలియన్ల (3 కోట్లు) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన ఏకైక రాజకీయ నేతగా మోదీ సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. ఇలా ప్రపంచ వేదికపై ఇతర అగ్రదేశాల నేతలకు అందనంత ఎత్తులో ఆయన నిలిచారు.



2లో..

## ఇరాన్‌పై అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'

మొదలైంది. అమెరికా అధ్యక్షుడి ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఈ దాడులను ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను ధ్వంసం చేయడం, వారి నౌకాదళాన్ని నిర్వీర్యం చేయడం, ఉగ్రవాద అనుబంధ సంస్థలను నిలువరించడం, ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా చూడటం వంటి నాలుగు లక్ష్యాలను వైట్‌హౌస్ నిర్దేశించింది. ఇరాన్ తన మొబైల్ లాంచర్లతో విచక్షణారహితంగా క్షిపణులను ప్రయోగిస్తోందని, ఆ ముప్పులను ఎలాంటి సంకోచం లేకుండా తొలగిస్తున్నామని సెంట్‌కామ్ స్పష్టం చేసింది.ఈ ఆపరేషన్ కోసం అమెరికా భారీస్థాయిలో సైనిక సంపత్తిని మోహరించింది. బీ–1, బీ–2, దీ–52 బాంబర్లు, ఎఫ్–15, ఎఫ్–16, ఎఫ్–18, ఎఫ్–22, ఎఫ్–35 ఫైటర్ జెట్లతో పాటు ఏ–10 అటాక్ జెట్లను రంగంలోకి దించింది. వీటితో పాటు పేట్రియాట్, థాడ్ వంటి క్షిపణి నిరోధక వ్యవస్థలు, ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు, ఎం–142 హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్స్, అణుశక్తితో నడిచే విమాన వాహక నౌకలు, గైడెడ్–మిస్సైల్ డిస్ట్రాయర్లను కూడా ఉపయోగిస్తున్నట్లు పెంటగాన్ తెలిపింది. ఈ దాడుల్లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, ఐఆర్‌జీసీ జాయింట్ హెడ్‌క్వార్టర్స్, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఇరాన్ నౌకాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, సైనిక కమ్యూనికేషన్ వ్యవస్థలు వంటి కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సైనిక చర్య కొనసాగుతుండగానే, అమెరికాలోని సొంత పార్టీ డెమొక్రాటిక్ సభ్యుల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఆపరేషన్‌పై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరుతూ మార్చి 2న కొందరు చట్టసభ సభ్యులు జాతీయ భద్రతా అధికారులకు లేఖ రాశారు. ఈ ఘర్షణలో ఇప్పటికే కొందరు అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ లక్ష్యాలు, చట్టపరమైన ప్రాతిపదిక, వ్యూహంపై కాంగ్రెస్‌కు, అమెరికా ప్రజలకు వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 1979 నుంచి అమెరికా, ఇరాన్ మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమం, బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి, ప్రాంతీయ సాయుధ గ్రూపులకు మద్దతు వంటి అంశాలపై ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఈ దాడుల ప్రభావం పడితే, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## 99 రోజుల పాటు అలుపెరుగని పరుగే

పంచాయతీల్లో గ్రామ సభల వేదికగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పైసా లబ్ధిని ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వం తరపున పారదర్శకత పెరుగుతుందని వెల్లడించారు.తెలంగాణ విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని రేవంత్ రెడ్డి.. కలెక్టర్లకు వివరించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులను ప్రతీ నెలా ఆయా ఏజెన్సీలకు చెల్లించాలని ఆదేశించారు. ఈ పథకానికి నిధుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లకే ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను మరింత పటిష్ఠం చేసేందుకు వాటి సమీపంలో ఉన్న మెడికల్ కాలేజీలతో హాస్పిటల్స్‌ను అనుసంధానం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పలువురు కలెక్టర్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కలెక్టర్లు ఆయా జిల్లా హెడ్ క్వార్టర్లలో నివాసం ఉండటం లేదని, ఈ విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు అంటే అదే జిల్లాలో ఉండాలని అక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అలా లేని వారిని సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. పద్ధతి మార్చుకోని కలెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రానున్న 99 రోజుల పాటు జిల్లా కలెక్టర్లు అత్యంత అలర్ట్‌గా ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరు ప్రజాప్రతినిధులను అందులో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ 99 రోజుల పాటు జిల్లా కలెక్టర్లు తమ పరిధిని దాటి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కారించడం కోసమే అధికార యంత్రాంగం పనిచేయాలని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

## భారత్‌కు రష్యా భరోసా

ఇదిలా ఉండగా, ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడినా కొద్ది రోజుల పాటు ఎలాంటి ఇబ్బంది ఉండదని, భారత్ వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. 25 రోజులకు సరిపడా క్రూడాయిల్, 25 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ ఉందని, ఇవి దాదాపు 8 వారాల పాటు సరిపోతాయని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తా సంస్థ పేర్కొంది. దేశీయ అవసరాలకు సరిపడే ఆయిల్ సరఫరాలో 40 శాతం హర్మూజ్ జల సంధి ద్వారా.. మిగతా 60 శాతం ఇతర మార్గాల ద్వారా అందుతుంది.ఇక, భారత ఇంధన సంస్థలు ప్రస్తుత ఒప్పందాల ప్రకారం రష్యా ముడి చమురును దిగుమతి చేసుకుంటూనే ఉన్నాయి. ఇది అదనపు నిల్వలను అందిస్తుంది.

ప్రాంతీయ ఉద్రిక్తతలతో చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కొన్నేళ్లుగా నిల్వలను పెంచుకుంటూ వస్తోంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తగినంత ఇంధన నిల్వలను నిర్వహిస్తాయి. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు సరఫరాలో ఏర్పడే అవాంతరాలను అధిగమించి అదనపు పరిపుష్టిగా పనిచేస్తాయి. దేశవ్యాప్తంగా సరఫరా పరిస్థితి, ఫ్యూయల్ స్టాక్‌ను పరిశీలనకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను కేంద్ర పెట్రోలియం సహజవనరుల శాఖ ఏర్పాటుచేసింది.

భారత్ ప్రధాన ప్రాధాన్యతలు నిరంతరాయ ఇంధన లభ్యత, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న, పనిచేస్తున్న దాదాపు కోటి మంది భారతీయ పౌరుల శ్రేయస్సు అని ప్రభుత్వ వర్గాలు నొక్కిచెప్పాయి.మరోవైపు, యుద్ధం పరిణామాల ప్రభావం అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ఇప్పటికే మొదలైంది. క్రూడాయిల్ ధరలు మేర పెరిగి బ్యారెల్ 85 డాలర్లకు చేరుకోగా ఐరోపాలో సహజ వాయువు ధరలు దాదాపు 50 శాతం మేర పెరుగుదల నమోదయ్యింది. సౌదీ అరేబియా ప్రభుత్వ సంస్థ ఆరాంకో చెందిన అతిపెద్ద చమురుశుద్ధి ప్లాంట్ రాస్ తనూరా, ఖతార్‌లో గ్యాస్ ప్లాంట్‌పై ఇరాన్ దాడితో తాత్కాలికంగా మూసివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రవాణా స్తంభించి ఇంధన సరఫరా కుప్పకూలే ప్రమాదం ఉంది. హర్మూజ్ మీదుగా వచ్చే నౌకల రవాణా, బీమా ఛార్జీలు పెరుగుదలతో అదనపు ఖర్చులు ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై ప్రభావం చూపనున్నాయి.

## గ్రామ వికాసమే లక్ష్యం

నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా , అటవీ శాఖలకు సంబంధించిన కీలక ప్రాజెక్టులపై సమగ్ర చర్చ జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు.

### జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ ప్రాజెక్ట్ పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని అభిప్రాయపడిన నేతలు, ఇప్పుడు దీనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తలసరి రోజుకు 55 లీటర్ల నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రహదారుల నిర్మాణం, నియోజకవర్గాల వారీగా నిధుల కేటాయింపుపై పవన్ కళ్యాణ్ సీఎంతో చర్చించారు.

### మ్యాజిక్ డ్రెయిన్లు - హనుమాన్ ప్రాజెక్ట్

పారిశుధ్య నిర్వహణలో భాగంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తం చేయాలని పవన్ కళ్యాణ్ ప్రతిపాదించగా సీఎం సానుకూలంగా స్పందించారు. వేసవి కాలం ముగిసేలోపే డ్రెయినేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని, తద్వారా సాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని నిర్ణయించారు.

ఇదే సమయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ ప్రాజెక్ట్ వివరాలను పవన్ కళ్యాణ్ వివరించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల అనుసంధానం కోసం చేపట్టిన అడవి తల్లి బాట పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఇరువురు నేతలు ఒక అవగాహనకు వచ్చారు.

### అభివృద్ధికి బాటలు.. వికసిత్ భారత్ దిశగా

గ్రామాల బలోపేతం కోసం ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ విమర్శలు పక్కన పెట్టి, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

ఈ భేటీలో కేవలం అభివృద్ధి అంశాలే కాకుండా, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి రాజకీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం.

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో మరో అడ్డంకి

విధ్వంసం జరుగుతోందని దీన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూసీ పరివాహకంలో ఉన్న లంగర్ హౌస్, నార్సింగి, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండానే ఎప్పటి నుంచో ఉన్న వేలాది మహా వృక్షాలను నరికేస్తున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. చెట్లను తొలగించడం వల్ల పర్యావరణ, సామాజిక ప్రభావంపై ఎలాంటి సోషల్ ఇంపాక్ట్ స్టడీ చేపట్టకుండానే ప్రభుత్వం పనులు ప్రారంభించిందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.మూసీ నది తీరాన్ని తీవ్రంగా ధ్వంసం చేస్తున్నారని దాని వల్ల ప్రజల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే చెట్ల నరికివేతను వెంటనే ఆపాలని ప్రాజెక్ట్ అమలు సంస్థ అయిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహా రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీని లాయర్ ఇమ్మనేని రామారావు కోరారు. అదే సమయంలో పర్యావరణానికి హాని చేసే పనులను ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కారణంగా ప్రభావితం అయ్యే కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని పేర్కొన్నారు. లాయర్ ఇమ్మనేని రామారావు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న హెన్‌ఎచ్?ఆర్?సీ కేసు నమోదు చేసి దర్యాప్తును మొదలుపెట్టింది. పర్యావరణాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని పేర్కొన్న ఇమ్మనేని రామారావు మూసీ తీరాన్ని రక్షించేందుకు చట్టపరంగా తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో మరో అడ్డంకి

కూడా పేదవాళ్ల ఎంతో మంది ఇళ్లను కూల్చేశారు. మూసీ లో కడుతున్న ఈ బిల్డింగ్ మాత్రం హైడ్రా రంగనాథ్‌కి, ప్రభుత్వానికి కనబడటం లేదా? అని కవిత డిమాండ్ చేశారు. ఈ అక్రమ వెంచర్‌ను కూల్చే వరకు వదిలిపెట్టే ప్రసక్తేలేదు అని కవిత హెచ్చరించారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదు అని కవిత హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు.

### నార్సింగిలో కవిత ఆందోళన

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు బిగ్ షాక్ తగిలింది. నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తున్న ఓ వెంచర్ వద్ద ఆందోళన చేస్తున్న కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తోన్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి కవిత ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళణ ఉద్రిక్తంగా మారడంతో కవితను అరెస్ట్ చేశారు. అంతకు ముందు నార్సింగి వద్ద ఆందోళన చేపట్టిన కవిత హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి ఫోన్ చేశారు.అయితే ఫోన్ చేస్తే కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఉన్నానని చెప్పడంతో ఆయన బుల్డోజర్లు తెచ్చే వరకు కూడా తామంతా ఇక్కడే ఉంటాం అని కవిత ఆందోళణను తీవ్రతరం చేశారు.

### త్వరలో వెలుగుమట్లకు వెళ్తాం

'జనం బాటలో భాగంగా చెరువులు, నదులు అక్రమించి కట్టిన బిల్డింగ్ ల గురించి మనం కంప్లైంట్స్ ఇచ్చాం ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. ఖమ్మంలోని వెలుగుమట్లలో 600 మంది పేదల ఇళ్లు కూల్చేశారు.. త్వరలోనే అక్కడకు వెళ్తాం'అని కవిత చెప్పుకొచ్చారు.'గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సిటీలోని మధు రిడ్జ్ అపార్ట్ మెంట్ వాళ్లను కూడా ఇబ్బంది పెడుతున్నారు. ఎంతో మంది మధ్య తరగతి వాళ్లు కష్టపడి అక్కడ అపార్ట్‌మెంట్లు కొనుక్కున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం కట్టిన ఆ అపార్ట్‌మెంట్ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారు'అని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇక్కడ ఇప్పుడిప్పుడే కడుతున్న, ఎవరికీ నష్టం లేని బిల్డింగ్‌ను మాత్రం ఆపటం లేదు'అని కవిత మండిపడ్డారు.

### ప్రైవేట్ వాళ్లతో పంచాయతీ లేదు

'మాకు ప్రైవేట్ వాళ్లతో ఎలాంటి పంచాయితీ లేదు. ప్రభుత్వంతోనే మా పంచాయితీ. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ బిల్డింగ్‌ల నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చారు'అని కవిత గుట్టురట్టు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలను ఆపారు. ఆ తర్వాత ఆమ్యామ్యాలు తీసుకొని మళ్లీ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చారు. న్యాయం అందరికీ ఒకే విధంగా ఉండాలన్నదే మా పోరాటం. ఖచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటాం'అని కవిత ధీమా వ్యక్తం చేశారు.

## యూట్యూబ్‌లో మోదీ ప్రపంచ రికారు

### ప్రపంచ నేతలపై మోదీ పైచేయి

యూట్యూబ్‌లో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న నేతల జాబితాను పరిశీలిస్తే.. ప్రధాని మోదీ మొదటి స్థానంలో ఉండగా, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే మోదీకి ఏడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉండటం విశేషం. ఇది ప్రపంచవ్యాప్తంగా మోదీకి ఉన్న క్రేజ్‌ను, ఆయన ప్రసంగాలకు ఉన్న ఆదరణను ప్రతిబింబిస్తోంది.

### 19 ఏళ్ల ప్రయాణం.. 33 వేల వీడియోలు

ప్రధాని మోదీ 2007లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే సాంకేతికత ప్రాధాన్యతను గుర్తించి తన యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. గత 19 ఏళ్లలో ఆయన సుమారు 33,000 కంటే ఎక్కువ వీడియోలను షేర్ చేశారు. ఇందులో ఆయన విదేశీ పర్యటనలు, మన్ కీ బాత్ కార్యక్రమాలు, ఎన్నికల ప్రసంగాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన వీడియోలు ఉన్నాయి. నిరంతరం అప్‌డేట్‌గా ఉంటూ ప్రజలతో నేరుగా మమేకమవ్వడమే ఆయన విజయ రహస్యమని డిజిటల్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### ఇన్‌స్టాగ్రామ్‌లోనూ 10 కోట్ల మార్కును దాటిన మోదీ

కేవలం యూట్యూబ్ మాత్రమే కాదు ఇతర సామాజిక మాధ్యమాల్లోనూ మోదీ హవా కొనసాగుతోంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 100 మిలియన్ల (10 కోట్లు) మార్కును దాటింది. ఒక రాజకీయ నేతకు సోషల్ మీడియాలో ఇంత భారీ స్థాయిలో ఫాలోయింగ్ ఉండటం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. డిజిటల్ ఇండియా నినాదాన్ని స్వయంగా పాటిస్తూ.. టెక్నాలజీని సామాన్యుడికి చేరువ చేయడంలో మోదీ ముందంజలో ఉన్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

## యాదాద్రి ఆలయం మూసివేత

యాదాద్రి చంద్రగ్రహణం సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ద్వారాలు మూసివేసారు. మంగళవారం ఉదయం 7 గంటల నుండి మరుసటి రోజు 8.45 ని. వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేసారు.

మంగళవారం మధ్యాహ్నం3.30 నిమిషాల నుండి సాయంత్రం 6:47 చంద్రగ్రహణం వున్న నేపథ్యంలో మార్చి 4 న ఉదయం 3.30 కు యాదాద్రి ఆలయ ప్రధాన ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమం తరువాత ఉదయనీ 8.45 ని నుండి భక్తులకు సర్వ దర్శనాల పునరుద్ధరణ వుంటుంది.

## పిల్లలను చంపి తల్లి సూసైడ్

యాదాద్రి భువనగిరి ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బీబీనగర్ మండలం గొల్లగూడెంలో తెల్లవారుజామున ఘోరం జరిగింది. వివాహిత తన ఇద్దరు పిల్లలను చంపి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగాగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే కారణమా లేక మరేదైనా సమస్య ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అక్రమ రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టివేత

ఏలూరు ఏలూరు రూరల్ మండలం, తంగెళ్ల మూడి పంచాయతి పరిధి లో రత్నాస్ దాభా బిల్డింగ్ అశోక్ లైలాండ్ 14 చక్రాల లారీ ఆపి విజిలెన్సు, రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసారు. లారీలో 25.80 టన్నులు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుచున్నట్లుగా గుర్తించారు. బియ్యను స్వాధీనం చేసుకున్నారు.

## ఇరాన్ పార్లమెంట్పై ఇజ్రాయెల్ దాడి

న్యూఢిల్లీ ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత ఉధృతమైంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పార్లమెంట్ భవనం లక్ష్యంగా మారినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో జోర్డాన్, కువైట్, ఇజ్రాయెల్లోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడింది. ఇక రియాద్లోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ దాడి చేసింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.

## విద్యుత్ వినియోగంలో నయా రికాం

పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇళ్లు, పరిశ్రమలతోపాటు వేసవి కాలంలో పంటలకు కూడా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. దీంతో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నెలకొంది. అయితే డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ అధికారులు నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం మంగళవారం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం రోజున 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు లెక్కలు వెల్లడించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే రోజురోజుకూ భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నప్పటికీ ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నందుకు విద్యుత్ శాఖ సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు.వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండటం దీంతో వ్యవసాయానికి విద్యుత్ మరింత ఎక్కువగా అవసరం అవుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్రంలో పంట సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ వినియోగం పెరుగుతుండటం కూడా విద్యుత్ డిమాండ్ అధికం అవుతోందని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకోవడం అంటే రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, కార్యనిర్వహణకు నిదర్శనం అని భట్టి విక్రమార్క తెలిపారు. భౌగోళికంగా తెలంగాణ చిన్న రాష్ట్రమే అయినప్పటికీ పెద్ద రాష్ట్రాలతో సమానంగా విద్యుత్ సరఫరా చేస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, పట్టణాభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తుందని ఈ విద్యుత్ వినియోగమే చెబుతోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ, ఔషధ తయారీ, నీటి ప్రాజెక్టుల విస్తరణతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. దేశంలో అతిపెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ 19,900 మెగావాట్లు రాజస్థాన్ 20,600 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా చిన్న రాష్ట్రమైన తెలంగాణ 18,139 మెగావాట్ల డిమాండ్‌తో ఆ దరిదాపుల్లో నిలిచిందని ఇదే జాతీయ స్థాయిలో రాష్ట్రం సాధించిన ఘనత అని పేర్కొన్నారు. పరిశ్రమలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌ల కంటే తెలంగాణ ఎక్కువ విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేయడం విశేషమని చెప్పారు. 2023–24లో తెలంగాణ విద్యుత్ వినియోగం 15,623 మెగావాట్లు ఉండగా అది ఇప్పుడు 18,139 మెగావాట్లకు చేరుకుందని స్పష్టం చేశారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో 'హనుమాన్ ప్రాజెక్ట్'

అభివర్ణించారు. చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కడైతే ఏనుగులు, ఇతర వన్యప్రాణులు గ్రామాల్లోకి ప్రవేవించి ప్రజల ప్రాణాలకు, వ్యవసాయానికి ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఉన్నాయని, అలాంటి చోట్ల వీటిని ఎలా అదుపు చేయాలనే ఆలోచన నుంచే ఇది పుట్టిందని పేర్కొన్నారు.ఒకవంక వన్యప్రాణులను సంరక్షిస్తూనే మరోవంక వాటి బారి నుండి ప్రజల ప్రాణాలు, పంటలు, పశువులు, ఆస్తులను పరిరక్షించడమే ఈ హనుమాన్ ప్రాజెక్ట్ ప్రధాన కర్తవ్యమని పవన్ కల్యాణ్ చెప్పారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించడం, కావాల్సిన ఉపశమన చర్యలు తీసుకోవడం, పరిహారం చెల్లింపుల కోసం ఇప్పటివరకు ఇటువంటి ఒక వ్యవస్థ అనేది లేదని, ఈ హనుమాన్ ప్రాజెక్ట్ తో ఈ కొరత తీరిందని అన్నారు. దీనికోసం గ్రామీణ స్థాయంలో పంచాయితీరాజ్, వ్యవసాయ, ఉద్యాన వనాలు, రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు ఇతర విభాగాతో సమన్వయం చేసుకుంటామని, ఈ ప్రాజెక్ట్ ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారి జీపీఎస్ ట్రాకింగ్ వంటి పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించామని గుర్తుచేశారు. ఇందులో 93 రాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ టీమ్ వెహికల్స్, వైల్డ్ లైఫ్ అంబులెన్సు ఏడు ఉన్నాయని తెలిపారు.వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతిలో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ ట్రీట్మెంట్ సెంటర్స్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని పవన్ వివరించారు. వన్యజీవి రక్షక్ అనే వాలంటరీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టబోతున్నామని, వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయిలో పాములు, ఇతర జంతువుల నుండి ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా శిక్షణ ఇస్తున్నామని అన్నారు. వాలంటీర్లుగా స్థానిక యువతకు అవకాశాలు ఇస్తామని పవన్ స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారాన్ని గణనీయంగా పెంచామని, అంతకు ముందు అయిదు లక్షల రూపాయలు ఉంటే తాము వచ్చాకా దీన్ని 10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. గాయపడినవారికి పరిహారం మొత్తాన్ని రెండు లక్షలు నిర్ణియించామని తెలిపారు. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నామని అన్నారు. చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకొచ్చామని అన్నారు. ఇప్పటివరకు ఎనిమిది ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసి ఏనుగుల నుండి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించామని ఆయన వివరించారు.

## హోర్ముజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్

మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులు తీసుకురావడానికి వెళుతున్నవి ఉన్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆయా కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా విదేశీ జెండాలు కలిగిన నౌకల్లోని ముగ్గురు భారతీయ నావికుల మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మన నావికులు, మన నౌకల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసింది. షిప్పింగ్ కంపెనీస్ అండ్ రిక్రూట్మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీస్ (ఆర్పీఎస్ఎల్ఎస్) నావికులకు కీలక సూచనలు జారీ చేసింది. యుద్ధం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, బంధువులతో క్రమం తప్పకుండా కమ్యూనికేట్ కావాలని సూచించింది. నావికుల కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కూడా యాక్టివేట్ చేసింది.

## ఇండోనేషియాలో భారీ భూకంపం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇండోనేషియాలోని సుమత్రా దీవి భూకంపంతో ఉలిక్కిపడింది. మంగళవారం ఉదయం 10:26 గంటలకు (భారత కాలమానం ప్రకారం) సుమత్రా దీవి పరిసరాల్లో 6.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ధృవీకరించింది. భూకంప కేంద్రం సముద్రంలో ఉన్నప్పటికీ, దీవిపై ప్రకంపనలు తీవ్రంగానే వచ్చినట్లు తెలుస్తోంది. భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు నివేదికలు రాలేదు. అలాగే భవనాలు కూలిపోవడం గానీ, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లడం గానీ జరగలేదు. సముద్రంలో భూకంపం రావడంతో సునామీపై ఆందోళన వ్యక్తమైనప్పటికీ.. అధికారులు మాత్రం సునామీ హెచ్చరికలేవీ జారీ చేయలేదు. ఎలాంటి సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇండోనేషియా పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటం వల్లే ఇక్కడ తరచూ ఇలాంటి ప్రకంపనలు వస్తుంటాయి. టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ప్రాంతం కావడంతో భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోరణాలు ఇక్కడ సర్వసాధారణం. ఉదయం ఒక్కసారిగా భూమి కంపించడంతో స్థానికులు భయంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రస్తుతం అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు.

### లొంగిపోయిన మావోలు

## కాంగ్రెస్‌లోకి వస్తే ఆహ్వానిస్తాం

లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఇటీవలె మావోయిస్ట్ అగ్రనేతలైన దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. ఈ క్రమంలోనే మాట్లాడిన దేవ్‌జీ రాజకీయాల్లోకి వస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టుల విషయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ కాంగ్రెస్ పార్టీలోకి లొంగిపోయిన మావోయిస్ట్‌లు వస్తే ఆహ్వానం పలుకుతామని చెప్పారు. అయితే ఇప్పటివరకు తాము మాత్రం ఏ లొంగిపోయిన మావోయిస్ట్‌లను తమ పార్టీలో చేరాలని అడగలేదని తేల్చి చెప్పారు.మావోయిస్టులు తాము నమ్ముకున్న సిద్ధాంతం కోసం గత కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. తాము మొదటి నుంచి ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించామని పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో మాత్రం మావోయిస్టులతో చర్చలకు అంగీకరించలేదని విమర్శించారు. మావోయిస్టుల సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్న టీపీసీసీ చీఫ్ ప్రజల కోసం పోరాడిన వాళ్లపై గౌరవం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అయినా మావోయిస్టులు అయినా పేద ప్రజల కోసమే పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. ఇక అంతకుముందు బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ కోసం పని చేసిన వాళ్లను బీఆర్ఎస్ పార్టీ ఎన్నడూ గౌరవించలేదని మండిపడ్డారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని చెప్పిన టీపీసీసీ చీఫ్ కార్పొరేషన్ పదవులపై కసరత్తు జరుగుతోందని వివరించారు. ఇక ఖమ్మం భూదాన్ భూముల వ్యవహారంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం చెప్పారని తెలిపారు. రాజకీయాల కోసమే పినరయి విజయన్ మాట్లాడుతున్నారి కేరళలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## పంచముఖి ఆలయ పునర్నిర్మాణ
# పనులు ప్రారంభం

**సికింద్రాబాద్** తెలంగాణలోని ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం మొండా మార్కెట్ పంచముఖి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభం నేపథ్యంలో ఆలయ చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా వారికి వేదపండితులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే అన్ని ఆలయాలను కోట్ల రూపాయలతో అద్భుత క్షేత్రాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భక్తులు స్వచ్ఛందంగా విరాళాలతో పునర్నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా భక్తులంతా కలసికట్టుగా ఆలయాన్ని పునర్నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేసే క్రమంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## బాసర శ్రీ జ్ఞాన సరస్వతి
# అమ్మవారి ఆలయం మూసివేత

**నిర్మల్** కేతు గ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మహా నివేదన అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలకు ఆలయ అర్చకులు ద్వార బంధనం చేసారుత. అమ్మవారి క్షేత్రంలో ఈ రోజు అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేసారు.

ఈ రొజు రాత్రి 7 గం.లకు అమ్మవారి ఆలయం తొ పాటు ఉప ఆలయాల ద్వారాలు తెరచి గోదావరి జలాలతొ మహా సంప్రోక్షణ జరిగిన తరువాత మరుసటి రోజు బుధవారం అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు యధావిధిగా కొనసాగుతాయి

## హోలితోనే
# నామకరణాలు

**ఖమ్మం** హోలీ పండుగకు ఆ తండాకు ఓ ప్రత్యేకత ఉంది... పుట్టిన బిడ్డకు నామకరణం చేయాలంటే హోలీ పండుగ రావాల్సిందే... ఘనంగా హోలీ అడాల్సిందే...ఆనందం,ఆప్యాయత,అనురాగం,అనుబందం,అపూర్వం,ఆత్మీయత,అద్వితీయం,అమ్మరికలయిక....ఆకర్షితమైన అద్భుతమైన వేడుకలకు కేరాఫ్ హోలీ . గ్రామ గ్రామాలకు నడుమ గడియ దూరంలో ఉండే గిరిజన కుటుంబాలను ఒకే గూటికి చేర్చి సంబరాలు చేసే పండుగ హోలీ ...ఈ హోలీ ని గిరిజనులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ,యువకుల నుంచి వృద్దుల వరకు ఈ హోలీ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.ఇలాంటి సంబరాలుకు కేరప్ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా...

......ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా లో గిరిజన సంస్కృతి కి అద్దం పట్టే విదంగా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఈ హోలీ సంబరాలు తండాలో మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. హోలీ సంబరాలకు గిరిజనులు రూ. కొట్టి వరకు ఖర్చు చేస్తారు.మెదటి రోజు తెల్లవారుజామునమూడు గంటల నుంచే కాముని దహనం కార్యక్రమం ప్రారంబమవుతుమది.

కుల పెద్దలైన... గేడియగా పిలవబడే తండా పెద్దలు లాంఛనంగా ప్రారంభిస్తారు.పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తారు. తండాలో హ్పలీ రోజు నుంచి పుట్టిన ప్రతి బిడ్డకు మళ్లీ హ్పలీ పండుగ రోజు మాత్రమే నామకరణం చేయడంఆనవాయితీ,అప్పటివరకు పుట్టిన బిడ్డలకు నామకరణం చేయరు.మూడోరోజు తండా వాసులు రంగోలి ఆడుతారు.కాముని దహనం చేసిన ప్రాతం నుంచి సేకరించిన బూడిదను తండా యువకులు శరీరం పై చల్లుకిని ఆ తర్వాత రంగులు చల్లుకుంటు ఆడుకుంటారు.

మూడు రోజుల వేడుకతో లోక్యాతండ జనసందడితో కిటకిటలాడింది. హోలీ వేడుకలకు తండావాసులు తమ బందువులను తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. తండా వాసులు ఎక్కడ స్థిరపడినా హోలీ రోజు మాత్రం లోక్యాతండాకు చేరుకోటారు. ప్రతి హోలీ పండుగకు గ్రామంలో మహిళలు కొత్త వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. నూతన వస్త్రాలు ధరించి హోలీ జరుపుకుంటారు. మూడో రోజు కావడంతో హోలీని గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. పెద్దల నుంచి చిన్నారుల వరకు రంగులు చల్లుకుని ఆటపాటలతో డ్యాన్సులు నృత్యాలు చేస్తూ హోలీ నిర్వహించారు.

## కాణిపాకం ఆలయాన్ని మూసివేసిన
# ఆలయ అధికారులు, అర్చకులు

**చిత్తూరు** చిత్తూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో పాక్షిక కేతుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా శుభకృత్ నామ సంవత్సర పాలగుణ పౌర్ణమి చంద్ర గ్రహణం సంభవించనుండగా, శాస్త్రోక్త నియమాల ప్రకారం ఆలయ దర్శనాలను ఈరోజు ఉదయం మంచి రాత్రి వరకు జరిగే ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు ఈరోజు ఉదయం 6:20 గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం నిలిపివేయనున్నారు.

చంద్రగ్రహణం మధ్యాహ్నం 3:20 గంటలకు స్పర్శ కాలంతో ప్రారంభమై, సాయంత్రం 6:47 గంటలకు మోక్ష కాలంతో ముగియనుంది. శాస్త్రప్రకారం గ్రహణానికి 9 గంటల ముందే ఆలయాన్ని మూసివేయాల్సి ఉండటంతో భక్తులు ముందస్తుగా తమ దర్శనాలను ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

గ్రహణం ముగిసిన వెంటనే సాయంత్రం 6:47 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, అభిషేకం, నివేదన కార్యక్రమాలు ఏకాంతంగా నిర్వహించనున్నారు. అనంతరం రేపు ఉదయం సుప్రభాత సేవలతో స్వామివారి దర్శనం యథావిధిగా పునఃప్రారంభమవుతుందని దేవస్థానం స్పష్టం చేసింది. భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

# సమిష్టి కృషితో టీబీ నిర్మూలన సాధ్యం

**హైదరాబాద్** టిబి (క్షయవ్యాధి) నిర్మూలన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మందులతో పాటు సరైన పోషకాహారం, మానసిక ధైర్యం కల్పించే కౌన్సెలింగ్ కూడా టిబి రోగులకు ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా టిబి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన్ మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కు అనుసంధానంగా, కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ సంయుక్తంగా "ప్రాజెక్ట్ ఓజాస్" అనే సిఎస్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరిచందన దాసరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

హైదరాబాద్లో టిబి రోగులకు నిరంతర పోషకాహారం అందించడంతో పాటు, మానసిక సహాయం, కౌన్సెలింగ్ సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా టిబి బాధితులకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టిబి నిర్మూలన లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోవాలంటే సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ ముందుకు వచ్చి జిల్లా పరిపాలనకు తోడ్పడటం అభినందనీయమని, ఇటువంటి భాగస్వామ్య కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు.

## అలయ భూములను కాపాడాలని
# గ్రామస్థుల రిలే నిరాహార దీక్ష

**వికారాబాద్** 4 వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిన సంజీవ స్వామి దేవాలయాన్ని పునర్మించాలని,అన్యాక్రాంతం అవుతున్న దేవాలయ భూములను కాపాడలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా దోమ మండలం దొంగ ఎన్కెపల్లి గ్రామస్థులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.ఆలయం శిథిలమైపోయినా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదని... 104 ఎకరాల దేవాలయ మాన్యాపు భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్మకర్త పేరుతో పరిగి మాజీ సర్పంచ్ పార్థసారథి ఆలయ నిర్మాణ పనులను అడ్డుకోవడమే కాకుండా ఆలయ భూములు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్ళేందుకు కారకులవుతున్నారని ఆరోపించారు.పరిగి, చన్గోముల్ రెవెన్యూ లో ఉన్న ఆలయ భూములను మళ్ళీ ఆలయ రికార్డుల్లోకి ఎక్కించాలని....సంజీవ స్వామి ఆలయ నిర్మాణం కోసం 5 కోట్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

# స్మశానవాటికలో వ్యక్తి ఆత్మహత్య

**వికారాబాద్** పరిగి బస్ డిపో ఎదురుగా ఉన్న స్మశానవాటికలోని మర్రి చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్మశానవాటిక పక్క కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు దోమ మండలం పాశంబండ తాండాకు చెందిన దీపక్ (26) గా గుర్తించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పరిగిలో అద్దెకు ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దీపక్ ఆత్మహత్య కు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ..

# నేలకొండపల్లిలో వైభవంగా శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం

**ఖమ్మం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి లోని శ్రీ సంతాన వేణు గోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం జరిగింది.స్వామి వారి కళ్యాణాన్ని అర్చకులు సంప్రదాయ పద్ధతిలో జరిపించారు. ముందుగా ఎదుర్కోలు ఉత్సవం జరిపిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ని కళ్యాణ మండపం వద్దకు ఉత్సవ మూర్తుల విగ్రహాలను తీసుకొచ్చారు.అనంతరం అంగరంగ వైభవంగా వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిపించారు.కళ్యాణం అనంతరం ఆలయ పూజారులు దండలతో ఆడే ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి కల్యాణాన్ని చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం ఇదే రోజు స్వామి వారి కళ్యానాన్ని జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది.

# మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు



**గుడివాడ** ఈ నెల 8 వ తేదీని జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా సిబ్బంది సంక్షేమాన్ని




దృష్టిలో ఉంచుకుని గుడివాడ పట్టణంలోని స్థానిక ఏఆర్కేఏ హాస్పిటల్లో ఈ వైద్య పరీక్షలు నిర్వహించబడినవి. అదేవిధంగా బ్లడ్ డొనేషన్ క్యాంపు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సిబ్బందిలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు, వారి శ్రేయస్సు పట్ల పోలీస్ శాఖ కట్టుబాటును చాటిచెప్పడం జరిగింది.

# కల్తీ నెయ్యి వ్యవహారం

### - తిరుమల చేరుకున్న వన్ మ్యాన్ కమిషన్

**తిరుమల** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిషన్ తన విచారణను ముమ్మరం చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలోని ఈ కమిషన్ ఈరోజే తిరుమలకు చేరుకుంది.

క్షేత్రస్థాయి విచారణటీటీడీ మార్కెటింగ్ విభాగం, గోదాములు మరియు లడ్డూ పోటు (వంటశాల)లో కమిషన్ సభ్యులు స్వయంగా పరిశీలన జరపనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ నిబంధనలను ఎలా సడలించారు? తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేయడానికి కంపెనీలకు ఎలా అనుమతి ఇచ్చారు? అనే అంశాలపై అధికారులను ప్రశ్నించనున్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న అసలు కారకులు ఎవరు, అధికారుల నిర్లక్ష్యం ఎంతవరకు ఉందనే అంశాలపై లోతైన విచారణ జరిపి కమిషన్ త్వరలోనే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేయనుంది.

# చిలకలూరిపేటలో వీధి కుక్కల దాడి.

### - 10వ వార్డులో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు
### - పది మందికి గాయాలు

**పల్నాడు** పల్నాడు జిల్లా చిలకలూరిపేట 10వ వార్డులో వీధికుక్కల దాడిలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క వీధిలో వెళ్తున్న వారిని, వెంటాడి మరీ కరిచింది. ఈ దాడిలో సుమారు 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులందరినీ వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనతో పట్టణ ప్రజలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. జిల్లాలో వీధి కుక్కలపై పశుసంవర్ధక శాఖ అధికారుల ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కుక్కల సంతానోత్పత్తి పెరిగి వీధుల నిండా కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు కుక్కలకు వింత వ్యాధులు ప్రబలడం ఆందోళన కలిగిస్తోంది. .

వీటి ద్వారా ఇతర అంటు వ్యాధులు వ్యాపిస్తాయని స్థానికులు భయపడుతున్నారు. ఆపరేషన్లు చేశామని చెబుతున్నా, కుక్కల సంతతి ఏమాత్రం తగ్గకపోగా, అవి యథేచ్ఛగా సంతానోత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి, పట్టణం శివారులో ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గతంలో కోర్టు ఆదేశాలు ఇచ్చినా చిలకలూరిపేట మున్సిపాలిటీలో మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అధికారుల ఉదాసీనత వల్లే సామాన్యుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుండి తమను రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వందలాది మంది అంగన్వాడీలు అరెస్ట్




**పల్నాడు** పల్నాడు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది అంగన్వాడీలను పోలీసులు అరెస్ట్ చేసారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిన్న చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడి కార్యకర్తలు వెళ్లారు. ఆందోళన చేస్తున్న తమ పట్ల పోలీసులు పాశవికంగా ప్రవర్తించారంటూ అంగన్వాడీలు మండిపడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పెద్ద ఎత్తున్న శిబిరంలోకి బలవంతంగా వెళ్లి వేలాది మందిని మూకుమ్మడిగా అరెస్టులు చేసారు. టెంట్ కూల్చేసి, లైట్లు ఆపేసి మహిళలను బలవంతంగా ఈడ్చుకుంటూ బస్సుల్లోకి ఎక్కించారంటూ అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసుల తీరు, ప్రభుత్వ చర్యలపై అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం తో వున్నారు. సత్తెనపల్లి,రాజుపాలెం,ముప్పాళ్ళ, చిలకలూరిపేట,రొంపిచర్లలో అంగన్వాడీలను అరెస్టులు చేసారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ, రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి లను సత్తెనపల్లి స్టేషన్ లో నిర్బంధించారు.

# నటి దేవీప్రియ కారుకు ప్రమాదం..

### - డ్రైవర్ మృతి...



ప్రముఖ బుల్లితెర నటి దేవిప్రియ తన సహాయకుడితో కలిసి సోమవారం తెల్లవారుజామున కారులో చెన్నై నుంచి తిరుచ్చి వైపు బయల్దేరారు.పెరంబలూర్ వద్ద కారు టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ ముత్తు గణేశ్(38) వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి టైరు మారుస్తుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం దేవిప్రియ కారును ఢీకొంది.ఘటనలో కారు డ్రైవర్ ముత్తు గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.కారు పక్కన నిలబడి ఉన్న దేవిప్రియ తృటిలో తప్పించుకున్నారు. ఆమె సహాయకుడు దివాకర్ తీవ్రంగా గాయపడ్డారు.

## రంగుల మయంగా
# జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం

### - ఘనంగా హోలీ వేడుకలు జరుపుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది
### - హోలీ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



**నిర్మల్** నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పరస్పర స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. అలాగే పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ హోలీ వేడుకల్లో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు,ఎస్ఐ లు, ఆర్ ఎస్.ఐ లు, సిబ్బంది ఉన్నారు.

# శ్రీకాకుళం ఏబీసీడబ్ల్యూవో ఇంట్లో కోట్లు ..

### - ఏసీబీ సోదాల్లో భారీగా అక్రమాస్తులు

ఏబీసీడబ్ల్యూవో బాల ముకుందరావు ఇళ్లపై ఏసీబీ దాడులుసోదాల్లో రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తుల గుర్తింపుమెస్ బిల్లుల మంజూరుకు లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు. బంగారం, వెండి, స్థిరాస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులుశ్రీకాకుళం జిల్లాలో ఓ అవినీతి అధికారి బాగోతం వెలుగులోకి వచ్చింది. నరసన్నపేట వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) గడ్డి బాల ముకుందరావు నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

నరసన్నపేటతో పాటు సోంపేట విభాగానికి కూడా బాల ముకుందరావు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. వసతిగృహాల మెస్ బిల్లులు మంజూరు చేయడానికి, ప్రతి విద్యార్థికి రూ.15 చొప్పున వార్డెన్ల నుంచి ఆయన లంచం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి 28న అధికారులు ఆయన కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, లెక్కల్లో చూపని రూ.1,84,070 నగదు పట్టుబడింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిన్న శ్రీకాకుళం పట్టణంలోని బాల ముకుందరావుకు చెందిన రెండు ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో రాజాం, శ్రీకాకుళం, కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని 4 స్థిరాస్తుల పత్రాలు, 322 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.75 కిలోల వెండి వస్తువులు, కొంత నగదు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ రూ.1.10 కోట్లుగా ఉంటుందని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు

# గుడిసెల కూల్చివేత చుట్టూ రాజకీయ దుమారం

**ఖమ్మం, మార్చి 3,** ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చివేత పొలిటికల్ హైడ్రామాకు దారితీసింది. భూదాన్ భూములు రెవెన్యూశాఖ పరిధిలో ఉంటాయి. అందులో కూల్చివేతలు చేపడితే..సంబంధిత శాఖ మంత్రికి సమాచారం ఉంటుంది. పైగా రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లాకే చెందిన మినిస్టర్. దీంతో పలువురు ప్రజా సంఘాల నేతలు భూదాన్ భూముల్లో కూల్చివేతలపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారట.అయితే కూల్చివేతల విషయం తనకు తెలియదని..ఖమ్మం కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారట మంత్రి పొంగులేటి. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి, పైగా జిల్లా మినిస్టర్ పొంగులేటికి తెలియకుండా కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంటుందా అన్న చర్చ జరుగుతోంది. అలా అయితే పొంగులేటిని కాదని కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? అధికారులే సొంత నిర్ణయం తీసుకుని డిమాలిషన్ చేశారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెలుగుమట్ల ప్రాంతంలో గజం లక్షల రూపాయలు, ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుందట. ఆ ప్రాంతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు భూములు ఉన్నాయని..లేదు మంత్రి పొంగులేటి సంబంధికులకే అక్కడ ల్యాండ్స్ ఉన్నాయని మరొకరు ఆరోపణలు చేసుకుంటుడం చర్చకు దారితీస్తోంది.తమ ల్యాండ్ పక్కనే భూదాన్ భూముల్లో పేదలు గుడిసెలు ఉంటే..తమ భూముల ధర పడిపోతుందనే సాకుతో ఆ భూముల్లో ఉంటున్న పేదల ఇళ్లను తొలిగించారనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి. అయితే పేదల ఇళ్లు తొలగింపుకు మంత్రికి ఎటువంటి సంబంధం లేదని తుమ్మల అనుచరులు కొట్టిపారేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై రాజకీయ జోక్యం ఎలా ఉంటుందని ఎదరు ప్రశ్నలు వేస్తున్నారట. కూల్చివేతలపై తనకు సమాచారమే లేదని పొంగులేటి చెబుతున్నారు.ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో అందరికి కీలకమైన మంత్రి పదవులే ఉన్నాయి. అయితే పాలేరు ఎమ్మెల్యే, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవన్యూ శాఖ మంత్రికి తెలియకుండా భూదాన్ భూముల్లో కూల్చివేతలు సాధ్యమేనా.? అన్న డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కూల్చివేతపై సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. కలెక్టర్ అనుదీప్‌కు ఫోన్ చేసి పేదల ఇళ్ల కూల్చివేతపై సీరియస్ అయ్యారు పొంగులేటి. తన శాఖకు సంబంధించి తనకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారు..ఇదేం పద్దతి అంటూ మండిపడ్డారు. ఇళ్లు కూల్చివేసిన భూదాన్ భూములు ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని..ఖమ్మం నియోజకవర్గం మంత్రి తుమ్మలది కాబట్టి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారట మంత్రి పొంగులేటి. ఇళ్లు కూల్చివేసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం తమకు ఎటువంటి సంబంధం లేదు..కోర్టు తీర్పును అధికారులు అమలు చేశారని చెప్పుకొస్తోంది.మంత్రి పొంగులేటి తనకేం సంబంధం లేదంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇటు తుమ్మలకు సంబంధం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అలాంటప్పుడు భూదాన్ భూముల్లో కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి తెలియకుండానే డిమాలిషన్ చేపట్టారా.?తుమ్మల ప్రమేయం ఉందా? లేక ఆయన నియోజకవర్గ పరిధిలో కూల్చివేతలు జరిగాయి కాబట్టి అలిగేషన్స్ వస్తున్నాయా? అధికారులే కోర్టు ఆర్డర్స్ ప్రకారం ముందుకెళ్లారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైతే కూల్చివేతల వెనుక ఎవరున్నరన్నది క్లారిటీ లేదు. కాకపోతే ఖమ్మం జిల్లా మంత్రుల మధ్య మాత్రం కూల్చివేతలు కొత్త చిచ్చు పెట్టినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. భూదాన్ భూముల్లో పేదల కూల్చివేత ఇష్యూ ఎటుదారితీస్తుందో చూడాలి మరి.

# డబుల్ కష్టాలు

నల్గొండ ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అందజేస్తుంది. దానిలో భాగంగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి అందజేసింది. ఇంతవరకు బానే ఉన్నా వాటి నిర్మాణంలో నాణ్యతతో కూడిన పనులు చేయకపోవడం, అక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అనేక చోట్ల అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇదే విధానం మండలంలోని విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లోనూ కొనసాగుతోంది.

2020లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇండ్లు పూర్తయి రెండు సంవత్సరాలైనా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో 2023లో ధర్నా నిర్వహించగా అప్పుడు అర్హులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంటుతో కట్టడంతో ఆ ఇండ్లు ఇప్పుడు శిధిలావస్థకు చేరాయి.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చిన సంతోషం లేకుండా కారు చీకట్లో మగ్గుతున్న కాలనీ వాసుల దుస్థితి కి నిదర్శనం మండల కేంద్రంతో పాటు విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇచ్చిన ఇండ్లు ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలైన కరెంట్, త్రాగునీటి సౌకర్యం , సి సి రోడ్లు లేక వచ్చిపోయే వర్షాలతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి బురదతో కంపు కొడుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే ఈగలు, దోమలు, స్వైరవిహారం చేస్తున్నాయని, కారుచీకట్లో పాములు, తేళ్ళ బెడదతో సతమతం అవుతున్నామని లబ్ధిదారులు ఇప్పటికే పలుసార్లు మండల అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు పిర్యాదు చేసిన పలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణకు రావడం లేదని దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి కంపు కొడుతున్నదని డబుల్ బెడ్ రూమ్ గృహ నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డబుల్ బెడ్ రూమ్ నివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని అన్ని వసతులు కల్పించి అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసి త్రాగునీరు, విద్యుత్తు, సైడ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు వసతులను కల్పించకుండా వదిలేసిసింధీ. అప్పటి నుండి ఇప్పటి వరకు సమస్యలు మాత్రం తేలడం లేదు. డబల్ బెడ్ రూమ్ గృహనివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వమైనా వసతులను కల్పించాలి.

# కూల్చివేతలపై తీవ్రమవుతున్న విమర్శలు

నల్గొండ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# నూతన ఎండోమెంట్ కమిషనర్‌ని కలిసిన తెలంగాణ స్టేట్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియన్ ఇన్స్టిట్యూషన్ ఫౌండర్ ట్రస్ట్ ఇన్ అసోసియేషన్ సభ్యులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎండోమెంట్స్ కమీషనర్ గా నియమితులైన హనుమంతరావు ని తెలంగాణ స్టేట్ చారిటబుల్ హాండ్ హిందు రిలీజియస్ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్ ట్రస్ట్ ఇన్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కరాయణి నరసింహమూర్తి, జనరల్ సెక్రెటరీ నాగేల్ల శ్రీనివాస్, సెక్రటరీ విజయకుమార్, ట్రెజరర్ ఆదిత్య లక్ష్మణరావు, కమిటీ సభ్యులు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉమా రెడ్డి, దేశ్ పాండే, దివాకర్ రావు, బూరుగు సంతోష్ కుమార్, మట్టికే గౌరీ శంకర్, నర్సింగ్ రావు, మట్టపల్లి రావు ఆంజనేయ శర్మ, అంజయ్య నాగేష్ విష్ణు తదితరులు ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంతరావుని కలిసి అభినందనలు తెలిపినారు. తెలంగాణ ఫౌండర్ ట్రస్ట్ కి సంబంధించిన డిమాండ్ ను వారి యొక్క సమస్యలను పరిష్కరించాలని చెప్పి ఒక మెమొరండం సమర్పించారు.



# హోలీ పండుగ శుభాకాంక్షలు

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు**



**జగిత్యాల** జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తో ఉత్సాహంగా, సంతోషంగా హోలీ వేడుకలు నిర్వహించడం జరిగింది. హోలీ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. రంగుల పండుగ హోలీ అందరికీ సంతోషం కలగాలని, మీ జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, వెలుగులను నింపాలని ఆకాంక్షించారు.

# కంటైనర్ ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**- ప్రయాణికులకు గాయాలు**

**యాదాద్రి** ఏపీఎస్ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనక నుండి ఢీకొంది. ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం జాతీయ రహదారిపై జరిగింది. ప్రమాదం లో పదిమంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. నిడదవోలు డిపో చెందిన బస్సు హైదరాబాద్కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# ఆటవీ అధికారులను అడ్డుకున్న రైతులు

**ములుగు** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో ఆటవీ శాఖ అధికారులు జేసీబీలతో కందకాలు తవ్వడం వివాదానికి దారి తీసింది. 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను అటవీ శాఖ అధికారులు లాక్కుంటున్నారని రైతులు అడ్డుకున్నారు. సాగు చేసుకుంటూ బ్రతుకుతున్నామని, తమ జీవనాధారమైన భూములను లాక్కోవద్దని రైతులు ఆందోళనకు దిగారు.

# దళిత యువకుని మరణం పట్ల విచారణ చేస్తాం

**- డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

**- మృతుని కుటుంబానికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం**

**బద్వేలు** కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం,శ్రీ అవదూత కసినాయన మండలం, గంగనపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దిలీప్ అత్యంత కిరాతక హత్యకు గురైన ఘటన ప్రతి మనిషి మనసును కలచివేసింది. ఒక అమాయక యువకుడిని పెట్రోల్ పోసి దహనం చేయడం అనేది మానవత్వానికి మచ్చ. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు? మన సమాజానికి జరిగిన అవమానం.ఈ దారుణ ఘటనపై కడప డిసిసి బ్యాంక్ చైర్మెన్ మంచురి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం శ్రీ అవధూత కాశి నాయన మండలం లోని గంగనపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కొడుకుని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల వేదన వర్ణించలేనిది. వారి కన్నీళ్లు చూసిన ప్రతివారూ కలత చెందకుండా ఉండలేరు. ఈ కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన వంతుగా తక్షణ సహాయంగా రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు? వారి వెంటే మేమున్నాం అనే నమ్మకానికి చిహ్నం.ఈ అమానుషానికి పాల్పడిన దుర్మార్గులను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్ష విధించాలని పోలీసులను ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి ప్రభావం ఉన్న వారైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని, బద్వేల్ టీడీపీ నాయకత్వం కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.మన కూటమి ప్రభుత్వం దళితుల రక్షణకు కట్టుబడి ఉందని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు ? ఆర్థిక సహాయం, న్యాయ సహాయం, భద్రత ? త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమాజంలో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ యువనాయకులు చెరుకూరి రవికుమార్, డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అరవ శ్రీనివాసులు, భిరం జయరామిరెడ్డి, బాలిరెడ్డి, ప్రహల్లదరెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, మొగల్ రహమతుల్లా, రామయ్య, శంకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, క్రిష్ణారెడ్డి, సుబ్బారాయుడు యాదవ్, కరుణాకర్, సమరసింహారెడ్డి, వివరమిరెడ్డి, షేక్ రఫీ, సురేంద్ర,పగిడి సందీప్,మిట్ట వంశీ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు.

# అపోలో యూనివర్సిటీలో వికసిత్ భారత్ కార్యక్రమం

**- పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**చిత్తూరు** చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశాన్ని ఆ విద్యా సంస్థ విద్యార్థులకు తెలియజేసిన చిత్తూర్ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ,..,భారతదేశ ఉజ్వల భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఈ సందర్భంగా తెలిపారు.. ఈ విషయాన్ని గ్రహించిన ఎన్డీఏ సర్కార్ ఆదిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ వినోద్ బట్, ప్రోగ్రాం కన్వీనర్ అప్పారావు, యూనివర్సిటీ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# తమ్మినేనిపై వేటు

హైదరాబాద్ తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది.రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది.సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

# పల్నాడు జిల్లాలో దీపావళి గోడౌన్లలో తనిఖీ నిర్వహించిన అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు

**పల్నాడు** చిలకలూరిపేట దీపావళి గోడౌన్లలో పోలీసు అధికారులు తనిఖీలు జరిపారు. ఇక్కడ ఉన్న రెండు గోడౌన్లలో స్వయంగా అడిషనల్ ఎస్పీ నిరంజన్, డిఎస్పి హనుమంతరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లలో ఉన్న మొత్తం బాణాసంచాలో పేలుడు పదార్థాలు ఏం మేరకు ఉన్నాయో నిపుణులతో పరీక్షలు జరిపి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసిన అధికారులు

**తిరుమల** మంగళవారం నాడు చంద్రగ్రహణం నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటుగా టీటీడీ స్థానిక ఆలయాలను కూడా మూసివేసారు. ఈ విషయాన్ని టీటీడీ అధికారులు మీడియాకు తెలిపారు. ఉదయం 3:21 గంటల నుంచి రాత్రి 6:47 గంటల వరకు ఆలయాలను మూసివేసారు. . గ్రహణం విడిచిన తర్వాత శుద్ధి నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతి ఇస్తారు. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా ఆపివేశారు.

# జిల్లాలో షీ టీమ్తో మహిళలు, బాలికలకు భద్రత

**మహబూబ్నగర్** జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు ×షీ టీమ్స్× బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి, ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది సివిల్ డ్రస్లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి× నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా, అందులో 4 కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించగా, 14 మందిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని చర్యలు తీసుకున్నామని, 2 ఎఫ్ఐఆర్లు నమోదు చేయడంతో పాటు 6 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలోని 70 హాట్స్పాట్ ప్రాంతాలను సందర్శించి నిఘా నిర్వహించినట్లు తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో షీ టీమ్స్ బృందాలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాయని ఎస్పీ గారు తెలిపారు. బాలికలు, విద్యార్థినులు తమపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేయబడిందని, మహిళలు మరియు బాలికల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.విద్యార్థినులు మరియు మహిళలు తమ విద్యపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలని, ప్రతి ఒక్కరి రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఎస్పీ గారు తెలిపారు. విద్యాసంస్థల వద్ద మరియు రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని తెలిపారు.అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్ ? బ్యాడ్ టచ్, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా వినియోగం, మానవ అక్రమ రవాణా, సెల్ఫ్ డిఫెన్స్, మహిళా మరియు బాలల రక్షణకు ఉన్న చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## ప్రభుత్వాస్పత్రి మార్చురీలో

# ఓ మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

**జడ్చర్ల** ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఓ మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగసాల గ్రామానికి చెందిన పోలే భీమేశ్వర్ అనే వ్యక్తి లారీ డ్రైవర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భీమేశ్వర్ చెరువులో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్చురీలో ఉన్న శవాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ స్పందించారు. సిబ్బంది మార్చురీలోకి వెళ్తుండగా కుక్కలు అందులోనికి వెళ్లాయని వివరణ ఇచ్చాడు. ఈ మధ్యనే 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చారు. కానీ మార్చురీలో మాత్రం సదుపాయాలు కల్పించకపోవడంతో పాత మార్చురీనే నిర్వహిస్తున్నారు. మార్చురీలో శవాన్ని తీసుకెళ్లాలంటేన బంధువులు భయపడుతున్నారు.

# ఇద్దరు పిల్లను చంపి తల్లి ఆత్మహత్య

**యాదాద్రి భువనగిరి** కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

# ఐక్యత, ఆనందానికి ప్రతీక హోళీ పండుగ

**- గ్రామ, మండల ప్రజలందరికీ హోళీ పండుగ శుభాకాంక్షలు**

**- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్ర గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ హోళీ పండుగ సందర్భంగా గ్రామ,మండల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హోళీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం,ఐక్యత,స్నేహభావం నింపాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినం అందరిలో ప్రేమ, శాంతి, పరస్పర గౌరవాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి ఇంటిలో సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. అలాగే ప్రజలు సురక్షితంగా, పర్యావరణ హితంగా సహజ రంగులతో, సాంప్రదాయ పద్ధతుల్లో హోళీ వేడుకలను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# విలాసాగర్ సర్పంచ్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శాలువాతో సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్యను ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈఈ గంగాధర శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా కాసేపు పరస్పరంగా చర్చించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై సర్పంచ్ కనకయ్య అధికారులతో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఏనుగుల కొమురయ్య,ఏనుగుల ప్రశాంత్ కుమార్, బొప్పేన శ్రీనివాస్, బొప్పేన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించాలి

**- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి ఎలాంటి వేతనం లేకపోవడం అన్యాయమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే గౌరవ వేతనం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# గ్రహణ సమయంలో మేలు చేసే దర్భలు

**- గ్రహణములు - దర్భలు - విశిష్టత**

**- దర్భను గూర్చి తప్పక తెలుసుకోవలసిన ముఖ్య విషయములు**



**మంథని ( ప్రశ్న న్యూస్)** దర్భ గడ్డి ఏ విధంగా ఆవిర్భవించింది? ఏయే సందర్భములలో దర్భని తప్పక ఉపయోగించాలి?దర్భలు మానవ శరీరమునకు ఏ విధంగా ఉపయోగకరం?పురాణములలో దర్భ గురించి తెలిపిన విషయమేమీ?వేమన దర్భను గూర్చి వ్రాసిన పద్యమేమి?మనకున్న పవిత్రమయిన వృక్ష సంపదలలో గడ్డి జాతికి చెందిన "దర్భ" ముఖ్యమయినది. ఈ దర్భలో చాలా జాతులున్నాయి. వీటిలో దర్భ జాతి దర్భను అపరకర్మలకు, కుశ జాతి దర్భను శుకర్మలకు, బర్హిస్సు జాతి దర్భను యజ్ఞయాగాది శ్రౌత క్రతువులకు, శరము (రెల్లు, ఈ పేరు వినగానే నాకు రెల్లుపూల పానుపు గుర్తుకొస్తుంది) జాతి దర్భను గృహ నిర్మాణాలకు వినియోగించాలని ధర్మశాస్త్రాలు చెపుతున్నాయి. దీని ఆవిర్భావం వెనుక అనేక కథలున్నాయి. కొంతమంది దీనిని విశ్వామిత్రుని సృష్టిగా పరిగణిస్తారు. కూర్మ పురాణం ప్రకారం, విష్ణుమూర్తి కూర్మావతారంలో మందర పర్వతాన్ని (క్షీరసాగర మధనం సందర్భములో) మోస్తున్నప్పుడు, ఆ పర్వత రాపిడికి కూర్మము వంటిమీద ఉండే కేశములు సముద్రములో కలిసి అవి మెల్లిగా ఒడ్డుకు కొట్టుకొనిపోయి కుశముగా మారాయనీ, అమృతం వచ్చినప్పుడు కొన్ని చుక్కలు ఈ కుశ అనే గడ్డి మీద పడటం వలన వాటికి అంత పవిత్రత సంతరించుకుంది అనీ చెప్పబడింది. వరాహ పురాణం ప్రకారం, ఈ దర్భలు వరాహావతారములో ఉన్న శ్రీ మహావిష్ణువు శరీర కేశములని చెప్పబడింది. అందువలననే దర్భ గడ్డిని శ్రీ మహావిష్ణువు రూపములని జనులు భావించి భాద్రపద మాసంలో దర్భాష్టమి నాడు వీటికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వీటికి దేన్నయినా శుద్ధి చేసే శక్తి ఉందని నమ్మిక. ఈ నమ్మకాన్ని నిజం చేస్తూ శాస్త్రవేత్తలు వీటిని విరేచనాలు, రక్తస్రావం, మూత్రపిండాలలో రాళ్ళు, మూత్రవిసర్జనలో లోపాలు మొదలయిన వానికి మందుగా వాడుతున్నారు. అలానే ముంజ పర్వతం మీద ఉండే దర్భ అతిసారాది రోగాలకు ఔషధమని అథర్వణ వేదంలో చెప్పబడింది. అసలు దర్భ అన్న పదం వినగానే మనకు గుర్తుకొచ్చేది గ్రహణ కాలం. ఆ సమయంలో అన్నిటి మీదా దర్భను ఉంచడం మనకు అలవాటు. కానీ అలా చేయటం వెనుక ఉన్న అసలు రహస్యమేమిటంటేసూర్య, చంద్ర గ్రహణ సమయాలలో కొన్ని హానికరమయిన విష కిరణాలు భూమి మీదకు ప్రసారమవుతాయని ఈనాటి విజ్ఞానశాస్త్రం నిరూపిస్తోంది. ఇలాంటి వ్యతిరేక కిరణాలు దర్భల కట్టల మధ్యలోంచి దూరి వెళ్ళలేకపోతున్నాయని ఇటీవల కొన్ని పరిశోధనలలో కూడా తేలింది.

# మహాశాంతి హోమానికి పలువురు ఎమ్మెల్యేలకు ప్రత్యేక ఆహ్వానం



**హన్మకొండ(ప్రశ్న న్యూస్)** జిల్లాలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ సమాజ శాంతి, దేశాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, సౌభాగ్యాల కోసం నిర్వహించనున్న మహాశాంతి హోమ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించే కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ ఆహ్వాన కార్యక్రమంలో నిర్వాహకులు పలువురు ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి మహత్తర యజ్ఞంలో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి మహాశాంతి హోమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆశీర్వచనాలు అందించాలని ఆహ్వాన పత్రం అందజేశారు. హోమం నిర్వహణ ఉద్దేశాలు, కార్యక్రమ విస్తృతి, వేదపండితుల ఆధ్వర్యంలో జరగనున్న ప్రత్యేక పూజల గురించి వివరించారు. జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేసే ఈ కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరిను కలిసి దేశశాంతి హోమానికి ప్రత్యేక ఆహ్వానం పలికారు. దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజల్లో సత్సంకల్పాలు పెంపొందాలని ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ప్రముఖ ప్రజానేత కేఆర్ నాగరాజును కలిసి హోమంలో పాల్గొనాలని కోరారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిను కూడా కలిసి మహాశాంతి హోమానికి ఆహ్వానించారు. ప్రజల క్షేమం కోసం నిర్వహించే ఈ యజ్ఞంలో తప్పకుండా పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలుఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ"మహాశాంతి హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల శక్తిని పెంపొందిస్తాయి. ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం నిర్వహించే యజ్ఞాలు మన సంప్రదాయాలకు ప్రతీకలు. ఈ కార్యక్రమం జిల్లాకు ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను" అన్నారు. ప్రజానేత కేఆర్ నాగరాజు మాట్లాడుతూ,"దేశ శాంతి, ప్రజల ఐక్యత కోసం నిర్వహించే హోమాలు ఎంతో అవసరం. యువత ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని భారతీయ సంస్కృతిని పరిరక్షించాలి" అని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, "మహత్తర యజ్ఞాలు సమాజానికి ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తాయి. ప్రజల క్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నాను" అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ,"ప్రజల శాంతి, సామరస్యాలు, సుభిక్షం కోసం నిర్వహించే మహాశాంతి హోమం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ యజ్ఞాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వాహకులు వెల్లడించిన వివరాల ప్రకారం, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, మహామృత్యుంజయ హోమం తదితర ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై యజ్ఞంలో పాల్గొని దైవ ఆశీర్వాదాలు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక గురువులు, సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు. మహాశాంతి హోమం జిల్లాలో ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది పలకడంతో పాటు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వ వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చిన్నారుల హోళీ కేళీతో 21వ వార్డులో

# ఘనంగా రంగుల పండగ

**- పరస్పరం రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలియజేసి సమైక్యతను చాటిన చిన్నారులు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు వేణుగోపాల స్వామి కాలనీలో హోళీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీలోని చిన్నారులు ఉదయం నుంచే గులాల్ రంగులతో ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు. ఆటలు,పాటలు,నృత్యాలతో కాలనీ వీధులు కళకళలాడాయి. పిల్లల ఉత్సాహాన్ని చూసి పెద్దలు కూడా వేడుకల్లో భాగమై ఆనందాన్ని పంచుకున్నారు. స్నేహభావం,ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ రంగుల పండుగను కాలనీ వాసులు ఆనందంగా జరుపుకోవడం విశేషం. హోళీ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కాలనీ వాసులు సంతోషంగా గడిపి,సమైక్యతను చాటారు.

## వేములవాడ నూతన డీఎస్పీగా

# శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ సబ్‌డివిజన్‌లో నూతన డీఎస్పీగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వక స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మాట్లాడిన శ్రీనివాసులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా పని చేస్తానని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా పోలీస్ శాఖను మరింత ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన వేములవాడ నూతన డీఎస్పీ శ్రీనివాసులు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బదిలీపై బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ను వారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేములవాడ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డీఎస్పీకి అభినందనలు తెలియజేసి, ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖ పనితీరును మరింత మెరుగుపరచాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

## యుద్ధప్రాతిపదికన కుక్కల నియంత్రణకు

# ప్రత్యేక చర్యలు చేపట్టాం

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- బాధితులకు అండగా ఉంటాం**

**- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ : పుల్కం రాజు, నరాల శేఖర్**




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం పిచ్చికుక్క విజృంభణతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పట్టణంలోని పలు కాలనీలు, ప్రధాన రహదారులపై సంచరించిన కుక్క సుమారు 25 మందిపై దాడి చేసి గాయపరిచింది. బాధితుల్లో ఆలయ దర్శనానికి వచ్చిన రాజన్న భక్తులు కూడా ఉన్నట్లు సమాచారం. దాడిలో గాయపడిన వారిని వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రేబీస్ నిరోధక టీకాలు వేస్తూ అవసరమైన వైద్యం అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. తీవ్ర గాయాలు పొందిన కొందరిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు వెల్లడించారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు ప్రారంభించామని, 15 రోజుల క్రితం 40 కుక్కలను ఏబీసీ కేంద్రానికి తరలించామని తెలిపారు. మరిన్ని కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని,బాధితులకు అండగా ఉంటామని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఘటన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ పట్టణంలో కుక్కల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు.

# వరంగల్ క్రికెట్ ప్రేమికులకు తీపి కబురు

వరంగల్ వరంగల్ జిల్లాలోని క్రికెట్ ప్రేమికులకు, యువతకు గుడ్‌న్యూస్. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మె?ల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో ఈ స్టేడియం అందుబాటులోకి రానుందని చెప్పారు. క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా జరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణను దేశపు క్రీడా రాజధాని మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025ను ప్రవేశపెట్టారు. ఈ పాలసీలో భాగంగా 2036 ఒలింపిక్స్‌లో మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా.. వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రెడీ అయ్యారు. ఈ విషయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. త్వరలోనే జిల్లాకు క్రికెట్ స్టేడియం వస్తుందని చెప్పారు.

జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు. కాగా, జిల్లా యువత చాలా కాలంగా క్రికెట్ స్టేడియం కోసం ఎదురు చూస్తోంది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని 163 నేషనల్ హైవేకు సమీపంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలోనే స్టేడియం నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. దీంతో కుడా పరిధిలోని 30 ఎకరాల భూమి వివరాలను ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్‌రంజన్‌కు అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే స్టేడియం నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. అదే జరిగితే క్రికెట్ ప్రేమికుల చిరకాల కోరిక తీరనుంది. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే ఛాన్స్ ఉంటుంది.




# ‘ది కేరళ స్టోరీ 2’ టైటిల్ నుంచి ‘కేరళ’

## – పదాన్ని తొలగించాలి: హైకోర్టులో మరో పిటిషన్

బాలీవుడ్ నుంచి వచ్చిన ‘ది కేరళ స్టోరీ 2’ సినిమా టైటిల్ వివాదం కేరళ హైకోర్టులో మరో మలుపు తిరిగింది. ఈ చిత్ర పేరు నుంచి ‘కేరళ’ అనే పదాలను తొలగించాలని కోరుతూ తాజాగా మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కేరళ రాష్ట్రాన్ని ఉగ్రవాదానికి, మతమార్పిడులకు నిలయంగా చిత్రీకరిస్తూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా ఈ సినిమా ఉందని పిటిషనర్లు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై కోర్టు కూడా స్పందిస్తూ.. సినిమా విడుదలను వాయిదా వేయగా.. చిత్రబృందం డివిజన్ బెంచ్ నుంచి పర్మిషన్ తెచ్చుకుని విడుదల చేసింది. అయితే ఈ సినిమా విడుదలైన అనంతరం సినిమా టైటిల్‌ను మార్చాలంటూ ఒక రిటైర్డ్ సోషల్ సైన్స్ టీచర్, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ఒక మహిళా న్యాయవాది కలిసి పిటిషన్‌ను వేశారు. కేరళ పేరును టైటిల్‌లో వాడటం వల్ల ప్రపంచవ్యాప్తంగా కేరళీయులపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ఇది కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ప్రచారమని పిటిషన్‌లో తెలిపారు.మరోవైపు ఈ సినిమా విడుదలై మిశ్రమ స్పందనలను తెచ్చుకుంది. ప్రస్తుతం కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఈ సినిమా ప్రదర్శనను వ్యతిరేకిస్తూ నిరసనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

# ఫేక్ న్యూస్‌పై తనికెళ్ల భరణి ఆగ్రహం.. నా ఆస్తుల స్టోరీలు చూసి నేనే షాక్ అయ్యాను



డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న కొద్దీ ఫేక్ న్యూస్ సమస్య కూడా తీవ్రరూపం దాల్చుతోంది. ముఖ్యంగా సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై నిర్ధారణ లేని కథనాలు సృష్టించి వైరల్ చేయడం ఇటీవలి కాలంలో సాధారణంగా మారింది. కేవలం వ్యూస్ కోసం సంచలనాత్మక థంబ్‌నెయిల్స్ పెట్టి, ఆధారాలు లేని వార్తలను ప్రచారం చేయడంపై సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు, రచయిత తనికెళ్ల భరణి కూడా ఫేక్ న్యూస్ బారిన పడ్డారు. గత కొన్ని రోజులుగా ఆయన ఆస్తులు, వ్యక్తిగత జీవితం గురించి యూట్యూబ్‌లో పలు తప్పుడు వీడియోలు వైరల్ అవుతున్నాయి. తన ఇంటి ముందు అరడజను ఖరీదైన కార్లు నిలిపి ఉన్నాయని, కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయంటూ ప్రచారం జరగడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తనికెళ్ల భరణి వీడియో ద్వారా స్పందించారు. ఇటీవల నా ఆస్తులు చూసి అందరూ షాక్ అవ్వాల్సిందే అని రాశారు. కానీ ఆ వార్తలు చూసి నేనే షాక్ అయ్యాను అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తన ఇంటి ముందు ఖరీదైన కార్లు ఉన్నాయంటూ చూపిస్తున్న వీడియోల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఆ వార్తలు చూసి తాను, తన కుటుంబ సభ్యులు కలిసి నవ్వుకున్నామని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తాను ఏదో ఒక దేశం లేదా మతానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరగడాన్ని కూడా ఆయన ఖండించారు. నేను అన్ని మతాలను, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తాను. ఎవరినీ బాధపెట్టేలా నేను ఎప్పుడూ మాట్లాడను అని స్పష్టంగా తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు తనను నమ్మే మిత్రులు, శ్రేయోభిలాషులను బాధకు గురిచేస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి వార్తను నమ్మకూడదని, అసత్య ప్రచారాలను ప్రోత్సహించవద్దని ప్రజలను కోరారు. తనికెళ్ల భరణి పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు సినీ అభిమానులు, నెటిజన్లు ఆయనకు మద్దతుగా స్పందిస్తూ ఫేక్ న్యూస్‌పై కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు. వ్యూస్

# అబుదాబిలో చిక్కుకున్న ఈషా గుప్తా.. మూడు రోజుల తర్వాత ఢిల్లీ చేరుకున్నట్టు పోస్ట్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు తారస్థాయికి చేరడంతో అంతర్జాతీయ విమాన రాకపోకలకి ఆటంకం ఏర్పడింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల నేపథ్యంలో పలు దేశాలు ఎయిర్‌స్పేస్‌ను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి ఈషా గుప్తా అబుదాబిలో చిక్కుకుపోయి, మూడు రోజుల తర్వాత మార్చి 2న సురక్షితంగా ఢిల్లీకి చేరుకుంది. ఇంటికి చేరిన అనంతరం ఆ అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఫిబ్రవరి 28న నేను ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాను. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్‌ను మూసివేశారు. చుట్టూ గందరగోళం.. ఏం జరుగుతుందో ఎవరికీ స్పష్టంగా తెలియని పరిస్థితి అని ఈషా తెలిపారు. కొద్ది సేపటికే క్షిపణి దాడుల వార్తలు రావడం ప్రారంభమయ్యాయని, తర్వాతి క్షణంలో ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొన్నదని ఆమె పేర్కొన్నారు. అక్కడున్న వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్లలో మాట్లాడుకుంటూ, ఒకరినొకరు ఓదార్చుకుంటూ గడిపారు. ఆ మూడు రోజులు నిజంగా మానసికంగా చాలా కష్టంగా అనిపించాయి అని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈషా గుప్తా ప్రశంసించారు. ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న ప్రయాణికులకు ప్రత్యేకంగా భోజనం, తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆమె వెల్లడించారు. నేను చెక్-ఇన్ పూర్తి చేయకముందే ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో తిరిగి అబుదాబిలోని హోటల్‌కు వెళ్లాను. అక్కడి సిబ్బంది ముఖాల్లో భయం కనిపించినా, ప్రయాణికులకు ఎక్కడా ఒత్తిడి కలగకుండా ఎంతో సమర్థంగా పనిచేశారు అని ఈషా పేర్కొన్నారు. ఇక ఈషా గుప్తాతో పాటు దుబాయ్‌లో తమిళ స్టార్ అజిత్ కుమార్, టాలీవుడ్ నటుడు మంచు విష్ణు, నటి సోనాల్ చౌహాన్, బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా చిక్కుకుపోయినట్లు సమాచారం. ఈషా సురక్షితంగా భారత్ చేరుకోవడంతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నప్పటికీ, మిగిలిన వారంతా సురక్షితంగానే ఉన్నారనే



# థియేటర్లలో యావరేజ్ హిట్

## – ఇప్పుడు ఓటీటీలోకి ‘ఫంకీ’, స్ట్రీమింగ్ ఎప్పటి నుండి అంటే?




మాస్ కా దాస్ విశ్వక్ సేన్, ‘జాతి రత్నాలు’ ఫేం దర్శకుడు అనుదీప్ కె.వి. కాంబినేషన్‌లో తెరకెక్కిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఫంకీ . ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రధానంగా వినోదం నేపథ్యంలో రూపొందింది. సినిమా విడుదలకు ముందు నుంచే నిర్మాత సూర్యదేవర నాగవంశీ కథ, లాజిక్ వంటి అంశాలను పట్టించుకోకుండా కేవలం నవ్వుకోడానికి మాత్రమే థియేటర్లకు రావాలని ప్రమోషన్స్‌లో పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగానే సినిమాలో విశ్వక్ సేన్ మార్క్ కామెడీ, యాక్షన్ ఎపిసోడ్స్, హీరోయిన్ కయాదు లోహర్ గ్లామర్, అనుదీప్ స్టైల్ డైలాగులు హైలెట్‌గా నిలిచాయి. పెద్దగా కథ ఆకట్టుకోకపోయిన, ఎంటర్‌టైన్‌మెంట్ విషయంలో సినిమా ఓ మోస్తరు స్పందన సాధించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 14.5 కోట్ల గ్రాస్ వసూళ్లు, దాదాపు రూ. 8 కోట్ల షేర్ రాబట్టిన ఈ చిత్రం బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను చేరుకోలేకపోయిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. సుమారు రూ. 20 కోట్ల షేర్ అవసరమై ఉండగా, ఆ స్థాయికి చేరకపోవడంతో నష్టాలు నమోదయ్యాయి. థియేటర్లలో పరుగు ముగించిన ‘ఫంకీ’ ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ మూవీ డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. మార్చి 12 లేదా 13 తేదీల్లో స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. నరేష్, సంపత్ రాజ్, మురళీధర్ గౌడ్, వీటీవీ గణేష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించారు. ఇదిలా ఉండగా, ‘ఫంకీ’ తర్వాత విశ్వక్ సేన్ కల్ట్ అనే హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి స్వయంగా విశ్వక్ సేనే దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో మోస్తరు విజయాన్ని అందుకున్న ‘ఫంకీ’ ఓటీటీలో ఎలా రాణిస్తుందో చూడాలి.

# ఓటీటీలోకి ‘విత్ లవ్’.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?




ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న క్యూట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘విత్ లవ్’ (ఔట్‌ప్త్ర రాశీజవ) ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ఓటీటీ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు చిత్ర యూనిట్ శుభవార్త అందించింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకోగా.. ఈ చిత్రం మార్చి 6 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేవలం తమిళంలోనే కాకుండా తెలుగు, హిందీ, మలయాళం మరియు కన్నడ భాషల్లో కూడా ఈ సినిమా అందుబాటులోకి రానుండటం విశేషం. ఈ సినిమా విశేషాల్లోకి వెళ్తే, ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అభిషన్ జీవింత్ ఈ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం అయ్యారు. ఆయన సరసన మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ కథానాయికగా నటించి మెప్పించింది. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఒక ఆసక్తికరమైన కథా నేపథ్యంతో సాగుతుంది. బ్లైండ్ డేట్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (సత్య మరియు మనీషా), తాము ఒకే స్కూల్‌లో చదువుకున్నామని తెలుసుకోవడం, అక్కడి నుంచి తమ పాత జ్ఞాపకాలను మరియు స్కూల్ డేస్ క్రష్‌లను నెమరువేసుకుంటూ సాగే ప్రయాణం ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది. కేవలం 7 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించి ‘బ్లాక్‌బస్టర్’గా నిలిచింది.

# రై రై రారా.. అడ్డే లేని దారై రారా..



అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న పానిండియా మాస్ ఎంటర్‌టైనర్ ‘పెద్ది’ ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మేకర్స్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారాయి. ముఖ్యంగా ‘చికిరి’ సాంగ్ అయితే.. విదేశీయులు సైతం రీల్స్ చేసేంత క్రేజ్‌ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే సోమవారం ఈ సినిమా నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. ‘రై రై రారా.. రై రై రారా.. అడ్డే లేని దారై రారా.. రై రై రారా.. రై రై రారా.. హద్దే లేని తీరై రారా..’ అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, ఏ.ఆర్.రెహ్మాన్ స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. క్యాచీగా, జనబాహుళ్యంలోకి త్వరగా వెళ్లేలా, శ్రోతల్ని అలరించేలా ఈ మాస్ నంబర్ సాగింది. కథానాయకుని పరిచయగీతం ఎలా ఉండాలో ఓ కొత్త బెంచ్‌మార్క్‌ని సెట్ చేస్తూ, ఈ గీతాన్ని రూపొందించారు దర్శకుడు బుచ్చిబాబు సానా. రామ్‌చరణ్ తన మాస్ ఎనర్జీతో కూడిన గ్రేస్‌తో ఈ పాటలో స్టెప్పులు అదరగొట్టారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, నిర్మాత: వెంకటసతీష్ కిలారు, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

## ఆసుపత్రిలో చోరీ కేసును ఛేదించిన
# మియాపూర్ పోలీసులు

**- 7 తులాల బంగారం రికవరీ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మదీనగూడలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రిలో రోగుల సహాయకుల అజాగ్రత్తను ఆసరాగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న మహిళను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం చందానగర్ శివాజీ నగర్‌కు చెందిన జె. దుర్గ (45) అనే మహిళ అదే ఆసుపత్రిలో హౌజ్ కీపింగ్ సిబ్బందిగా పనిచేస్తూ, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది.గత నెల ఫిబ్రవరి 25న, చందానగర్ అపర్ణ హిల్ పార్క్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన భార్య చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఆమె ఎస్ఐసీయూలో ఉండగా, ఆయన గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో నిందితురాలు కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో (రాత్రి 8:51 నుండి 8:56 మధ్య) లోపలికి ప్రవేశించి, బ్యాగులో భద్రపరిచిన 3 తులాల గొలుసు, 3 తులాల గాజులు, ఒక తులం చెవి రింగులతో పాటు 3 తులాల వెండి వస్తువులను అపహరించింది. మరుసటి రోజు ఉదయం బాధితుడు తన వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు, డీఐ రమేష్ నాయుడు నేతృత్వంలో ఆసుపత్రిలోని సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితురాలు అనుమానాస్పదంగా గదిలోకి వెళ్లడం, విధి ముగిసిన తర్వాత భద్రతా సిబ్బందికి తన సంచిని చూపించకుండా తనిఖీల నుండి తప్పించుకోవడం కెమెరాలో రికార్డ్ అయ్యింది. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు ఆమె నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె తన నేరాన్ని అంగీకరించింది.

### స్వాధీనం చేసుకున్న సొత్తు..

నిందితురాలి వద్ద నుండి సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, 2.5 తులాల వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును అత్యంత వేగంగా ఛేదించి, బాధితులకు న్యాయం చేసిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

### ప్రజలు, ఆసుపత్రి యాజమాన్యాలకు సూచనలు..

ఆసుపత్రులకు వచ్చేటప్పుడు విలువైన ఆభరణాలు, భారీ నగదు వెంట తీసుకురావద్దు.ఆసుపత్రి యాజమాన్యాలు తమ సిబ్బందిపై నిఘా ఉంచాలన్నారు.సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా సంఘటన కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## లోక్‌సభ మాజీ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగికి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘన నివాళులు



మంగళగిరి (ప్రశ్న న్యూస్ )తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు మాజీ లోక్‌సభ స్పీకర్, దివంగత నేత జి.ఎం.సి. బాలయోగి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్. అమర్ నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యాదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, ఎన్నారై విభాగం రాజశేఖర్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత పార్లమెంటరీ వ్యవస్థలో ఆయన పోషించిన పాత్రను రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని నేతలు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్. అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం నుంచే కాకుండా, భారత దేశ చరిత్రలోనే లోక్‌సభ స్పీకర్ స్థాయికి ఎదిగి, సభా మర్యాదలను కాపాడటంలో బాలయోగి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేము. పార్లమెంట్‌లో ఆయన చూపిన సమయస్ఫూర్తి, హుందాతనం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ కేంద్రం నుండి రాష్ట్రానికి అందాల్సిన సహాయ సహకారాలను, నిధులను తీసుకురావడంలో ఆయన విశేష కృషి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన నిరంతరం తపించేవారని గుర్తుచేసుకున్నారు. బాలయోగి పార్టీలో అత్యంత క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు నాయుడు కి ఆయన అత్యంత ప్రీతిపాత్రమైన, నమ్మకస్థుడైన నాయకుడిగా ఉండేవారని ఎస్సీ సామాజిక వర్గం నుండి వచ్చి, అత్యున్నత స్పీకర్ స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం బడుగు, బలహీన వర్గాలకు గర్వకారణం. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం పరితపించేవారని పేర్కొన్నారు. బాలయోగి వదిలి వెళ్ళిన ఆశయాలను, విలువలను తెలుగుదేశం పార్టీ తూచా తప్పకుండా పాటిస్తుందని తెలిపారు.

# అవయవ దానంలో రాష్ట్రానికి ఆరో స్థానం

**- కేంద్ర ప్రభుత్వం వెల్లడి - రాష్ట్రంలో గడిచిన 2 నెలల్లో 64 మందికి కొత్త జీవితం**
**- గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పెరుగుతున్న స్పందన**
**- నిరీక్షించే 5000 మందిలో 50 ఏళ్ల లోపు ఉన్న వారే అత్యధికశీ**
**- ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరగాలి**
**- హైకోర్టు తీర్పు నేపథ్యంలో జీవన్ ధాన్ కార్యకలాపాలపై సమీక్షించిన మంత్రి సత్య కుమార్ యాదవ్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అవయవాల దానశీలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ ( కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ )రాష్ట్రాల వారీగా అవయవ దానశీ జాబితా-2025ను ప్రకటించిందని మంత్రి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు.

### పురోగతి కనిపించాలి శ్రీ..

ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జి జి హెచ్, కర్నూలు జిజిహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిన్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్-తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జి జి హెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు.అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, కడప, తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు.

### పెరిగిన మార్పిడి చికిత్సలు..

విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధుకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.

### పెరుగుతున్న ఔదార్యం..

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు.. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు. ఈ ఏడాది మరింతగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించి అవయవాలు కోసం ఎదురుచూస్తున్న బాధితులకు భరోసా కల్పించేందుకు కృషి చెయ్యాలని జీవన్ దాన్ సమన్వయకర్తలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు మంత్రి సూచించారు.

### 1,200 మంది బాధితులకు నూతన జీవితాలు...

రాష్ట్రంలో అవయవాలు ఆయుష్షు నిండి ఎదురుచూస్తున్న 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..

### అవయవాల కోసం 5,000 మంది

### ఎదురుచూపులు

రాష్ట్రంలో 20-50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం గమనార్హం. ఉత్పాదక వయసులోనే అవయవ వైఫల్యంతో చిక్కిశల్యమవుతుండటంతో వారి వ్యక్తిగత జీవితంలోనే గాక సామాజికంగానూ తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0-09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి శ్రీ సత్యకుమార్ తెలిపారు.

### కూటమి ప్రభుత్వం ప్రోత్సాహాశీ

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయి. అలాగే 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ. లక్ష వరకు పెంచే విషయశీ
ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు

## బీసీ సంక్షేమం కోసం
# కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది

- ఉద్యోగుల ఐక్యతే సమాజ అభివృద్ధికి పునాది
- నిబద్ధత, సేవాభావంతో పనిచేసి యువతకు ఆదర్శంగా నిలవండి
- ఏపీ యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు పిలుపు
- నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పల్లా శ్రీనివాస్ రావు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ యాదవ ఎంప్లాయిస్ సొసైటీ (ఏపీ వై ఈఎస్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఈ రోజు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు గారి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించబడింది. అమరావతిలో ఏపీ యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి నూతన భవన నిర్మాణం కోసం 30 సెంట్లు భూమి కేటాయించాలంటూ పల్లా శ్రీనివాస్ రావుకు సొసైటీ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఉద్యోగ స్థాయిలో మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమానంగా నిర్వర్తించడం ప్రతి ఉద్యోగి కర్తవ్యమని అన్నారు. సమాజ సమగ్రాభివృద్ధి కోసం ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం అత్యంత అవసరమని సూచించారు. యువతకు మార్గనిర్దేశనం చేస్తూ విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవల్లో ఉన్న యాదవ ఉద్యోగులు పారదర్శకత, నిజాయితీ, సేవాభావంతో పనిచేస్తే సమాజానికి గౌరవం పెరుగుతుందని తెలిపారు. సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ప్రతిభా పురస్కారాలు నిర్వహించడం ద్వారా కొత్త తరం ఉద్యోగులను ప్రోత్సహించాలని సూచించారు. బీసీల అభ్యున్నత, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ వై ఈ ఎస్ ఫౌండర్ ఒ రాష్ట్ర అధ్యక్షులు దామినబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి కావేటి రమేష్ యాదవ్, సెక్రటేరియట్ ఎంప్లాయిస్ పెద్దలు డా.అప్పారావు, రాఘవరావు, వివిధ శాఖల ఉద్యోగులు షణ్ముఖ రావు, భాస్కర్, రజనీకాంత్, లక్ష్మణ కుమార్, రమేశ్, రామకృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈమని లో నూతన హెల్త్ & వెల్నెస్ సెంటర్ ల నిర్మాణానికి భూమి పూజ

- మంత్రి నారా లోకేష్ చొరవతో 72 లక్షల నిధులతో రెండు హెల్త్ సెంటర్ ల నిర్మాణం
- విలేజ్ క్లినిక్ ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించిన కూటమి నాయకులు



ఈమని (ప్రశ్న న్యూస్)మంత్రి నారా లోకేష్ చొరవతో దుగ్గిరాల మండలం ఈమని లో రెండు చోట్ల నూతన హెల్త్ ఒవెల్నెస్ సెంటర్ ల నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు, 72 లక్షల నిధులతో వెల్నెస్ (విలేజ్) హెల్త్ సెంటర్ల ఏర్పాటుకి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ,వెల్నెస్ (విలేజ్) హెల్త్ సెంటర్ల ఏర్పాటు వల్ల ప్రజలకు అత్యంత చేరువలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ప్రాథమిక వైద్య సేవలతో పాటు మాతృ--శిశు సంరక్షణ, వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, సాధారణ చికిత్సలు ఈ కేంద్రాల ద్వారా అందించబడతాయని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు, ఈ కార్యక్రమం లో దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ సిద్దెల శ్రీవాణిఉజ్వల హరిణి,ఎంపీటీసీ-1 పసుపులేటి సాయిచైతన్య,ఎంపీటీసీ -2 గేరా బుల్లెమ్మాయి,మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్,గ్రామ పార్టీ అధ్యక్షులు కాబోతు దేవదాసు,అంచే మారుతివర ప్రసాద్, కాసరనేని శివరామ కృష్ణ,మన్నం అశోక్,అంచే రవిచంద్, గోళ్ళ శ్రీనివాస్,చొప్పరా రోశయ్య, పసుపులేటి శివకోటేశ్వరావు, నాలాది నాగేశ్వరావు,ఆకరంశెట్టి ఆంజనేయులు, చెన్నంశెట్టి ప్రభాకర్, చొప్పర ఏసుపాదం,గేరా జనార్దన్, అంచే రాంమోహన్, మండల ఎంపీడివో శ్రీనివాస్ గారు,డిప్యూటీ ఎంపీడీవో జవహర్లాల్, ఈమని పీహెచ్ (ఎంఓ) డాక్టర్ శ్రీవల్లి గ(ఎంఓ ) డాక్టర్. రెహమున్నిసా, సాంబిరెడ్డి ,ఉప సర్పంచ్ తమ్మపూడి స్వప్న,పంచాయతీ అధికారులు, పీహెచ్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు

## మంగళగిరిలో చిరువ్యాపారులకు మంత్రి నారా లోకేష్ చేయూత

**- మంత్రి నారా లోకేష్ సహకారంతో బడ్డీకొట్లులు, టిఫిన్, తోపుడు,ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేత**
**- మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు**
**తెలిపిన లబ్ధిదారులు**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, రూరల్ మండలంలోని పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు, ప్లాట్ ఫామ్ రిక్షాలను స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. మంగళగిరి పట్టణంలోని టిడ్కోకు చెందిన కొడాలి రమాదేవి, 29వ వార్డుకు చెందిన దామర్ల పద్మ, 3వ వార్డుకు చెందిన ఇండ్ల చిన్ని, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన యలగందుల సీతారావమ్మ, నిడమర్రు గ్రామానికి చెందిన మండేపూడి వీరయ్య జయానందంకు టిఫిన్ బళ్ళు అందజేశారు. టిడ్కోకు చెందిన కొండయ్యపాలేపు నారాయణరావుకు ఇస్త్రీ బండి, 20వ వార్డుకు చెందిన పల్లపు నాగమ్మకు తోపుడు బండి అందజేశారు. అలాగే నూతక్కి గ్రామానికి చెందిన పల్లాల వాణికి బడ్డీకొట్టు, తాడేపల్లి 7వ వార్డుకు చెందిన జుంజు త్రిపురకు ట్రై సైకిల్ అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టు, ఇస్త్రీ బండి, ప్లాట్ ఫామ్ రిక్షా, టిఫిన్, ట్రై సైకిల్, తోపుడు, టిఫిన్ బళ్ల అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్ల తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు . ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. వివిధ రకాల ఉపాధి కోసం మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల బండ్లు ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ వల్లూరు వెంకటేశ్వరరావు, 3వ వార్డు అధ్యక్షులు యుద్ధం అప్పారావు, తాడేపల్లి 7వ వార్డు అధ్యక్షులు కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కుర్రా బ్రహ్మం, వి.ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్, 20 వార్డు మాజీ కౌన్సిలర్ బట్టు చిదానందశాస్త్రి, ఏఎంసీ డైరెక్టర్ బాబి, షేక్ ఫిరోజ్ (ఖాదర్ వలీ), షేక్ సమీరా, ప్రసాద్ (పసి ), అడిగోపుల లక్ష్మీ రామ్ కుమార్, మన్యం చర్ల వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాసరావు, రాయపాటి విజయ్, మల్లెల రమణ, బూదాటి శ్రీనివాసరావు, బేతాళ కాంతారావు, తుమ్మలచెరువు రవి చరణ్, బాజీ, కట్టేపొగు శ్రీను, మండపూడి వీరయ్య, దాసరి దాసు, కట్టేపొగు ఉదయ్, మల్లేశ్వరరావు, ఉయ్యూరు సాంబిరెడ్డి, సువర్ణ రత్న కుమార్, కిరణ్ కుమార్, తాత కోటయ్య, మానవ సుబ్బారావు, మోతుకూరి రవి, సోమవతి శివనాగేశ్వరరావు, బిట్రా మోహన్, ఎర్రమల లాజరు, జొన్నకూటి శ్రీను, మూల్పురు కోటేశ్వరరావు, బొల్లా జగదీష్, ఇపూరి సురేష్, పట్టపు బాబురావు, నూతక్కి ప్రసాద్, తిరుమలరావు, రాచర్ల సురేష్, గుంటూరు సుధీర్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సహజ రంగులతో హోళీ పండుగను జరువుకుందాం

**- గ్రామ, మండల ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు**
**- స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్**



**బోయినపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ హోళీ పండుగను పురస్కరించుకుని గ్రామ, మండల ప్రజలకు శుభాభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోళీ అనేది కేవలం రంగుల పండుగ మాత్రమే కాకుండా మనుషుల మధ్య ఉన్న భేదాలను చెరిపేసి స్నేహబంధాలను బలపరిచే పర్వదినమని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఈ పండుగ ఒక వేదికగా నిలవాలని అన్నారు. సహజ రంగులను ఉపయోగిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా హోళీ వేడుకలను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ హోళీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని సర్పంచ్ అశోక్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆదర్శ్ నగర్ లో అన్ని సమస్యలే

- ఆరు నెలలుగా వెలగని వీధిదీపాలు
- సమస్యపై ఫిర్యాదులు చేసిన స్పందించని మాజీ కార్పొరేటర్, అధికారులు
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందించి సమస్యలు తీర్చేనా.?





కాప్రా(ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి మాటల్లో మాత్రమే మిగిలిపోయిందనే స్థానికుల విమర్శలు నిజమనె అనిపిస్తుంది. కాప్రా సర్కిల్ పరిధిలోని గత చర్లపల్లి డివిజన్‌లో ఎక్కడ చూసిన సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే 'ఆదర్శ' నగర్ వాస్తవానికి సమస్యలకు నిలయంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆరు నెలలుగా వెలగని స్ట్రీట్ లైట్ల సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. రాత్రివేళలు



చీకట్లోనే ప్రజలు ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని పాఠశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, విధులు ముగించుకుని ఇంటికి చేరే ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు భయాందోళనల మధ్యనే రాకపోకలు సాగిస్తున్నారు. వీధిదీపాలు పనిచేయకపోవడంతో దొంగతనాలు, ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరిగాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులలో అసలు స్పందన లేదని స్ట్రీట్ లైట్ల సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, కాప్రా సర్కిల్ అధికారుల నుంచి కనీస స్పందన లభించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాప్రా సర్కిల్ అధికారులు అసలు ఫోన్‌లు ఎత్తరని ప్రజాప్రతినిధుల బాధ్యత రాహిత్యంతో ప్రభుత్వ అధికారులు అన్న సంగతి మరిచిపోయారని ఎందుకంటే ఫోన్ ఎత్తని అధికారులపై ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. ఇలాంటి చరిత్ర తెలంగాణ రాష్ట్రంలో లేకపోవడంతో అధికారులు ప్రజల ఫోన్లను ఎత్తడం మానేశారు. కాప్రా సర్కిల్ లో అన్ని విభాగాల అధికారులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా అసలు ఎత్తకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వెళితే 'చూస్తాం' 'చేస్తాం' అంటూ కాలయాపన చేయడం తప్ప చర్యలు తీసుకోవడం లేదని సమస్యను తీర్చడం లేదని స్థానికులు చెబుతున్నారు.

## జిహెచ్ఎంసిలో జోనల్ కమిషనర్లు పూర్తిగా విఫలం..

వీధిదీపాల నిర్వహణలో జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు పూర్తిగా విఫలమైందని విమర్శలు గ్రేటర్ పరిధిలో వెల్లువెత్తుతున్నాయి. నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చుతామని చెప్పే పాలకులు అధికారులు, కనీసంగా లైట్లు వెలిగించే బాధ్యతను కూడా నిర్వర్తించలేకపోతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

గ్రీవెన్స్, ట్విట్టర్ తో పాటు పత్రికలో వచ్చిన కథనాలపై కూడా జిహెచ్ఎంసి అధికారులు అసలు స్పందించడం లేదని దీనికి అంతా కారణం ఎమ్మెల్యేల మంత్రుల నిర్లక్ష్యమే అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు కరెక్ట్ గా ఉంటే అధికారులు కూడా పనిచేసేవారని పాలకులకే ప్రజల సమస్యలు పట్టనప్పుడు అధికారులకు ఎలా పడతాయని ప్రశ్నిస్తున్నారు.

## మాజీ కార్పొరేటర్లపై విమర్శలు..

హైదరాబాద్ పరిధిలో కల్లిబొల్లి కబుర్లు చెప్పి గెలిచిన కార్పొరేటర్లు తమ పదవీకాలం అయ్యేంతవరకు కూడా ప్రవచల సమస్యలను ఆశించిన స్థాయిలో తీర్చిన దాఖలాలు లేవు. కేవలం డబ్బు సంపాదన పైనే చాలామంది కార్పొరేటర్లు తమ విధులను నిర్వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. డివిజన్ సమస్యలను మాజీ కార్పొరేటర్లు అసలే పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, ఆ తర్వాత ప్రజల సమస్యలను మరిచిపోయారని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం బాధ్యతలు ఒకరిపై ఒకరు మోపుకుంటూ కాలం గడుపుతుండగా, ఇబ్బందులు మాత్రం ప్రజలకే మిగులుతున్నాయి. ఆరు నెలలుగా చీకట్లో మగ్గుతున్న చర్లపల్లి డివిజన్ ప్రజలు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని వీధిదీపాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. 'ఉప్పల్ నియోజకవర్గం ఆదర్శం' అన్న పేరుకు తగ్గట్టు అభివృద్ధి ఎప్పుడో, ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎప్పుడో అనే సందేహాలు మాత్రం ఇంకా చీకట్లోనే మిగిలిపోయాయి.

# నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- సీఎం మార్పుపై ఇప్పటివరకూ చర్చించలేదని స్పష్టీకరణ



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు, నాయకత్వలేమిపై వస్తున్న వార్తలకు డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ (డీకే) తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం 'పాలు-తేనె' లాంటిదని ఆయన అభివర్ణించారు. మంగళవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య ఇచ్చిన వివరణను సమర్థించారు. విపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని, సీఎం అనుభవంతో మాట్లాడారని కొనియాడారు. "మా ఇద్దరి మధ్య బంధం పాలు-తేనెలా కలిసిపోయింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చ జరగలేదని డీకే స్పష్టం చేశారు. అలాగే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా తాను ఆరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మార్చి 10న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో తన కొనసాగింపుపై స్పందిస్తూ కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమైనవని సీఎం సిద్ధరామయ్య ఇదివరకే కొట్టిపారేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ మార్పు విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీకే తెలిపారు.

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది

- ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పానన్న ట్రంప్



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉస్త్రఎర్అశ్రీఖని

# రేషన్ బియ్యం అక్రమ దందాకు సర్వం సిద్ధం

- 1వ తారీకు నుండి 20వ తారీకు వరకు అధికారుల మౌనం
- ఓఆర్ఆర్ చుట్టూ బియ్యం మాఫియా రెచ్చిపోతుందా.?
- సివిల్ సప్లై, టాస్క్ ఫోర్స్ పోలీస్ శాఖల అధికారులు ఎక్కడ.?






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే సన్న బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు మళ్లీ తెరపైకి వచ్చాయి. 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతుండగా సివిల్ సప్లై, టాస్క్ ఫోర్స్, పోలీసు అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోంది.

### ఎక్కడ చూసినా షెడ్లలో నిల్వలు



ఔటర్ రింగ్ రోడ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు పెరిగినట్లు సమాచారం. ముఖ్యంగా షామీర్పేట్, పెద్ద అంబర్పేట్, శంషాబాద్, చేగుంట, గజ్వేల్, నర్సాపూర్ ఈ ప్రాంతాల్లో గోదాములు, ప్రైవేట్ షెడ్లలో భారీగా రేషన్ బియ్యం నిల్వ చేసి, రాత్రివేళల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల కనుసైగల్లోనే ఈ మాఫియా నడుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక సివిల్ సప్లై అధికారులు, పోలీసులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలనెలా మామూళ్ల పేరుతో మాఫియాలతో సంబంధాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సబ్సిడీ బియ్యం, మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముడవుతుండటం వల్ల అసలు లబ్ధిదారులు నష్టపోతున్నారు.

### కలెక్టర్లు, ఉన్నతాధికారుల బాధ్యత ఎక్కడ.?

జిల్లా కలెక్టర్లు, ఉన్నత సివిల్ సప్లై అధికారులు పరిస్థితిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్లో చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. 1 నుండి 20 వరకు దందా జరుగుతుంటే కావాలని అధికారులు ఎవరూ లేనని తెలుసుకొని 21 తర్వాత ఒక్కసారిగా దాడులు చేయడం యాదృచ్ఛికమా.? లేక ముందస్తు సమాచారం ఇచ్చే వ్యవస్థనా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆశయాలకు అధికారులే మంటగలుగుతున్నారని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. పేదలకు సన్న బియ్యం అందించాలన్న ప్రభుత్వ సంకల్పం, అధికారుల అవినీతితో మాఫియా చేతుల్లో మసకబారుతోంది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండ ఉండడంతో మామూళ్ల వ్యవహారం జరుగుతూ రేషన్ మాఫియాకు బలమిస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వెంటనే చర్యలు తీసుకోవాలి

గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కలఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని గోదాములు, షెడ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని, అధికారులపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా రేషన్ బియ్యం ట్రాకింగ్ కోసం టెక్నాలజీ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోతే, రేషన్ బియ్యం మాఫియా మరింత బలపడే ప్రమాదం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల అట్టడుగు వర్గాల హక్కులు కాపాడాలంటే, మాటలు కాదు రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాపై కఠిన చర్యలు అవసరం.

# నితిన్ నబిన్‌ను రాజ్యసభకు నామినేట్ చేసిన బీజేపీ

- నబిన్‌తో సహా తొమ్మిది మంది పేర్లను విడుదల చేసిన బీజేపీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను బీహార్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు నామినేట్ చేసింది. ఈ మేరకు ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బీజేపీ ప్రకటన విడుదల చేసింది. నితిన్ నబిన్‌తో పాటు మరో ఎనిమిది మంది పేర్లను బీజేపీ ప్రకటించింది. నితిన్ నబీన్ జనవరిలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్‌కు చెందిన ఆయన అంతకుముందు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. గత సంవత్సరం జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. బీహార్ నుంచి పార్టీ అధ్యక్షుడి స్థాయికి చేరిన తొలి నాయకుడిగా గుర్తింపు పొందారు. నితిన్ నబిన్‌తో పాటు రాజ్యసభకు వెళ్లనున్న వారి పేర్లను బీజేపీ విడుదల చేసింది. బీహార్ నుంచి నితిన్ నబిన్‌తో పాటు శివేశ్ కుమార్ ఉన్నారు. అసోం నుంచి తెరాశ గోవాలా, జోగెన్ మోహన్, ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీవర్మ, హర్యానా నుంచి సంజయ్ భాటియా, ఒడిశా నుంచి మన్మోహన్ సమాల్, సుజిత్ కుమార్, పశ్చిమ బెంగాల్ నుంచి రాహుల్ సిన్హా ఉన్నారు. 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. 10 రాష్ట్రాలలోని ఆరింటిలో బీజేపీ లేదా మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయి. దీంతో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోనుంది. రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న రాష్ట్రాలు మహారాష్ట్ర (7), తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బీహార్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హర్యానా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588